కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ(e) మాసపత్రిక

ఆగస్టు 2010

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాస పత్రిక

సంచిక:5 ఆగస్టు 2010 సంపుటి: 3

(http://kottapalli.in లోని e - సంచికకు పుస్తక రూపం)

ఈ సంచికలో. . . .

ముందు మాట

స్వాతంత్ర్యం. . . సంపాదకీయం. . . 1

ధారావాహికలు:

నీతి చంద్రిక. . . చిన్నయసూరి. . . 4

పిల్లలు చెప్పిన కథలు:

కాకి-నక్క. . . ఆమని . . . 11

నెమలి కల. . . చంద్రశేఖర్. . .13

మారిన మనసు. . . కృష్ణవేణి. . . 16

విష్ణు సాహసం. . . సిసింద్రి. . 19

వెర్రి వెంగళప్ప. . .స్టీఫెన్. . . 22

పెద్దలు చెప్పిన కథలు:

తెలివి కథ. . . నారాయణ. . . 25

ఇంద్రధనసు పిట్టలు!. . .లలిత. . . 29

నీకు రెండు-నాకు మూడు. . . గంగమ్మ. . . 33

అనువాద కథలు:

ఆవు-పంది. . . మాచిరాజు. . . 38

చేప నవ్వు. . . రామానుజన్. . . 41

పిల్లి దేవుడు. . . పర్తాప్ అగర్వాల్. . . 51

అవీ-ఇవీ:

హోం-వర్కు... శ్యాంప్రసాద్ నమ్మ...36

పాటలు:

నింగి సాగే మబ్బుల్లారా!. . .అఖిల. . . 55

చిరు చిరు నవ్వులు. . .గీతిక బృందం. . .56

ఎంతో మంచిది. . . విజ్ఞం స్కూలు. . . 57

వినువీధులలో ఎగిరే జండా. . . సరిగమ బృందం. . .58

బొమ్మకు కథ రాయండి:

భయం. . .లలిత. . . 60

మారిన మనసు

నీకు రెండు-నాకు మూడు



తెలివి కథ

ఈ మాసపు ముఖచిత్రం

"స్వాతంత్ర్యం వచ్చింది!"

స్వాతంత్ర్యం

సుధ వాళ్ళింట్లో ఒక పంజరం ఉండేది.

పంజరంలో ఒక చిలక.

ఆ చిలక ముద్దు ముద్దుగా మాట్లాడుతుంటే ఇంటిల్లిపాదికీ సంతోషంగా ఉండేది.

సుధకి ఆ చిలకంటే చాలా ఇష్టం.

ప్రతిరోజూ దానికి జామపళ్లూ, ద్రాక్షలూ, ఆపిల్ పళ్లూ, మొలకలు- ఏ కాలంలో ఏవి దొరికితే అవి తెచ్చిపెడుతుండేది, ఇష్టంగా.

చిలక సుధకి చాలా కథలు చెబుతుండేది.

ఒక రోజున అది స్వాతంత్ర్యం కథ చెప్పింది:

"మన దేశంలో ఇదివరకు చాలా మంది రాజులు ఉండేవాళ్లు. అందరూ ఎప్పుడూ కొట్టుకుంటూ, యుద్ధాలు చేసుకుంటూ ఉండేవాళ్లు. దాన్ని ఆసరాగా చేసుకొని, బ్రిటిష్ వ్యాపారులు కొందరు మన

దేశాన్ని పూర్తిగా ఆక్రమించేశారు. తమ ప్రభుత్వాన్ని ఇక్కడికి తెచ్చి పెట్టుకున్నారు. తమను ఎదిరించిన వాళ్లనందరినీ అణచివేశారు. దేశంలో మామూలు జనాలకేమో వాళ్లిచ్చే ఉద్యోగాలూ, డబ్బులూ, వాళ్ళు చూపించిన ఆశలూ, వాళ్ళ ఆధునిక భావాలూ- అన్నీ నచ్చాయి. వాళ్లంతా మౌనంగా అలాగే ఉండిపోయారు. ఇక మెల్లిగా బ్రిటిష్ వాళ్ళు మన దేశంలోని సంపదనంతా తమ దేశానికి తరలించుకుపోవటం మొదలుపెట్టారు...

అన్నిటినీ మించి, తెల్ల వాళ్ళు దోచుకున్నది మన స్వాతంత్ర్యాన్ని. స్వతంత్రం అంటే ఎవరికి వాళ్లు, తమకు నచ్చినట్లు సొంతంగా బ్రతికే హక్కు. ఇతరులెవ్వరికీ కష్టం కలిగించకుండా నీతి నియమాలతో బ్రతికేవాళ్ళకు స్వతంత్రం లేకపోతే ఊపిరాడనట్లు ఉంటుంది..."

అది ఇంకా ఏదో చెబుతుండగానే సుధ దాన్ని అడిగింది-

"నీకూ స్వాతంత్ర్యం లేదు కదా, ఇక్కడ? మరి నీక్కూడా అలా ఊపిరాడనట్లు ఉంటుందా?" అని.

చిలక కొంచెం సేపు ఏమీ మాట్లాడలేదు.

సుధ అన్నది- "నేను నీకు ఇష్టమైనవన్నీ తెచ్చిస్తాను కదా, జామకాయలు, సపోటాలు- అన్నీ?"

చాలాసేపు మౌనం తర్వాత చిలక అన్నది- "స్వాతంత్ర్యం వీటన్నిటికంటే బాగుంటుంది" అని.

సుధ కొంచెం సేపు ఆలోచించింది...

ఆ తర్వాత మెల్లగా పంజరం తలుపు తెరిచి, "నేను నీకు నచ్చేవి ఎన్నో తెచ్చి ఇచ్చాను ఇన్నాళ్ళూ. ఇప్పుడు అన్నిటికంటే నచ్చే బహుమతినిస్తున్నాను- నీ స్వాతంత్ర్యం. ఇకమీద నీకు ఈ పంజరపు జీవితం ఉండదు. ఎగిరిపో. నీరెక్కల్లో ఎంత శక్తి ఉందో చూసుకో. సంతోషంగా ఎగురు!" అన్నది.

చిలక ఉత్సాహంగా ఎగిరి, ఆకాశంలో అటూ ఇటూ తిరిగింది. మళ్ళీ మళ్ళీ వచ్చి సుధకు "థాంక్సు" చెప్పింది చాలాసార్లు.

ఇప్పుడు కూడా, అది రోజూ వచ్చి సుధను కలుస్తూనే ఉన్నది.

సుధ జామపళ్ళూ, ద్రాక్షలూ- అన్నీ పెడుతూనే ఉంది రోజూ.

అదికూడా సుధకు చాలా కథలు చెబుతున్నది- దానంతటఅదే.

ఇప్పుడు ఇద్దరూ సంతోషంగా ఉన్నారు.

దాన్ని చూసిన తర్వాత, సుధకు స్వాతంత్ర్యం అంటే ఏమిటో అర్థమైంది. మీకూ అర్థమైంది, కదూ?

అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!

సంగీత ప్రపంచంలో లలిత సంగీతానిది ఒక ప్రత్యేక స్థానం. సుకుమారంగాను, సున్నితంగాను ఉండే లలిత సంగీతం, భావ లాలిత్యానికి, గాన మాధుర్యానికి పెద్ద పీట వేస్తుంది. విజయవాడ వాస్తవ్యులు శ్రీ వారణాసి వెంకట్రావుగారు రాసి, స్వయంగా స్వరపరచి, 'విద్యార్థి సృజన కుటీర్' బాలలచే పాడించిన నవ గీత మాలికను బడి వారు "వెలుగు రేకలు" పేరిట సి.డి.గా వెలువరించారు. వారి అనుమతితో, ఆ పాటల్ని ఈ నెలనుండీ మీ ముందుకు తెస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ మాసపు పాటలు- "విను వీధులలో ఎగిరే జండా","నింగి సాగే మబ్బుల్లారా"లు వారి సౌజన్యం.

ఈ మాసపు కొత్తపల్లి ముఖచిత్రం "స్వాతంత్ర్యం వచ్చింది!"ని గీసింది, యువ చిత్రకారుడు శివప్రసాద్. ఆయనకు మీ అందరి తరపునా ప్రత్యేక ధన్యవాదాలు.

అభినందనలతో,

కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

పదవభాగం

మూల రచన: కీ.శే.పరవస్తు చిన్నయ సూరి. సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ.

జరిగిన కథ: ఒక వర్తకుడు అడవిలో ప్రయాణిస్తుండగా, అతని బండికి కట్టిన ఎద్దు కాలు విరిగి, క్రింద పడిపోతుంది. ఇక చేసేదేమీ లేక, అతను ఆ ఎద్దును అక్కడే వదిలేసి వెళ్ళిపోతాడు. అయితే త్వరలోనే అది లేచి తిరగటం మొదలెడుతుంది. అడవిలోని పచ్చికను మేసి, బలంగా తయ్యారై, ఒకనాడు అది పెద్దగా 'గణిళ్' అని రంకె వేస్తుంది. ఆ అరుపును విని, ఆ అడవికి రాజైన 'పింగళకం' అనే సింహం కూడా నిశ్చేష్టమై నిలబడిపోతుంది. ఇక చదవండి.... నీతి చంద్రిక పదవభాగం.

ఆ అడవిలోనే 'కరటకం, దమనకం' అనే నక్కలు రెండు ఉండేవి. దమనకంతో ముచ్చట్లాడుతూ ఉన్న కరకటం ఎద్దు రంకె విని అదిరిపడింది. దాని గుండెలు తట తటా కొట్టుకున్నాయి. కొంచెం సేపటికి గాని అది కోలుకోలేకపోయింది.

అప్పుడు అది శబ్దం వెలువడ్డ దిక్కువైపుకు కడకంటి చూపులు సారించి, నీలిగి, చెవి నిక్కించి విని, దమనకంతో ఇట్లా అన్నది- "ఇంకేమీ శబ్దం రావట్లేదు- నువ్వూ విన్నావు

కదా? ఇది ఏంటి?! ఇంతకాలంగా ఈ అడవిలో ఉన్నాము. ఇంత భయంకరమైన అరుపును ఏనాడు గానీ వినలేదు" అని.

దమనకం సమాధానంగా తల ఊపుతూ "ఔనౌను. ఇది వరకు ఎన్నడూ విన్న శబ్దంకాదు ఇది- మహా ఆశ్చర్యకరమైన అరుపు. అదిగో చూడు- మన రాజు పింగళకుడు యమునా నదికి పోబోతూన్న వాడు- చేతలు ఉడిగి నిలబడి పోయాడు- ఈ ధ్వని విని కాబోలు!" అని చిరునవ్వు నవ్వి, "అంతవాడే ఇట్లా అయ్యాడు. ఇక మనం ఎంతవాళ్లం?" అన్నది.

అప్పుడు కరకటం 'ఇంత భయంకరంగా అరిచే జంతువు మామూలుది అయి ఉండదు. అలాంటి జంతువు ఈ అడవిలోకి ఎక్కడినుండి వచ్చి చేరింది? మనం దాని అరుపునైతే విన్నాం- కానీ అది ఎలా ఉంటుందో చూడలేదు. నిన్నరాత్రో, ఈ రోజు ప్రొద్దున్నో అది ఇక్కడివచ్చి చేరుకొని ఉండవచ్చు. ఇప్పుడిక మనకు ఎట్లాంటి కష్టాలు రానున్నాయో, ఎవరికి ఎరుక?" అన్నది.

అప్పుడు దమనకం "ఈ అడవి ఏమైనా మన మాన్యమా? 'ఇంకొక చోటికి పోకూడదు ' అని మనకు ఏమైనా నియమమా? ఇక వేరే అడవంటూ ఏదీ లేదా? పుట్టిన ఊరును విడచిపోవటం ఎవరికైనా గాని కష్టమే- అట్లాగని చావటానికి అంగీకరిస్తారా?- అయినా ఇంత ఆలోచన ఎందుకు? మనకిప్పుడు వలస పోవలసినంత కష్టం ఏమి వచ్చింది? ఇంత వరకూ ఆ జంతువు నల్లనిదో, తెల్లనిదో తెలీదు మనకు. ముందు అది చిన్నపాటి జంతువో, మహాద్భుతమైన భయంకర మృగమో తెలుసుకుందాం. ఆ పైన ఏం చెయ్యాలో ఆలోచించవచ్చు. 'పిట్ట కొంచెం - కూత ఘనం' అన్నట్లు, చిన్న జంతువుకు సైతం పెద్ద గొంతు ఉండవచ్చు! 'నిజానికి ఈ జంతువు ఏమంత క్రూరమైనది కాదు' అనేందుకు సూచనలు కొన్ని నాకు ఈసరికే లభిస్తున్నాయి- నువ్వూ చూడు- అటువైపున పక్షులు కలవరపడిన లక్షణాలేమీ కనబడటం లేదు కదా? బాగా విను. అవి ఏ మాత్రం భయపడినా కలకలం వినబడకుండా ఉంటుందా?” అన్నది.

ఆ మాటలు విని కరకటం ఇట్లా అన్నది- "అవును. నువ్వు చెప్పేది నిజమే. కానీ 'ఈ జంతువు ఏది?' అనే సంగతి మాత్రం ఇంకా తెలీటం లేదు"- అని, కొంతసేపు ఊరుకొని, చిరునవ్వు నవ్వి 'ఆ., ఇప్పటికి గుర్తుకు వచ్చింది! మరేమీ కాదు- విను! కొన్నాళ్లకు ముందు ఒక వర్తకుడు దారిన పోతూ, తన బండిని ఈడ్వలేక క్రింద పడిపోయిన బక్క ఎద్దును ఒకదాన్ని, తన ప్రయాణపు తొందరలో ఈ అడవిలో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. అది యీ పాటికి గడ్డిపరకలు తిని, కొంత తేరుకొని, కొంచెం కండపట్టి, అక్కడక్కడా తిరుగుతూ ఉండగా చూశాను నేను. ఇప్పుడు మనం విన్నది దాని రంకె. సందేహం లేదు. ఊరికే ఇంతవరకూ ఏవేవో ఆలోచించి, పనికి మాలిన పిరికితనం తెచ్చుకున్నాం. మన రాజు మన కంటే శూరుడు!" అన్నది.

అప్పుడు దమనకం "మనం పింగళక మహారాజుకు మంత్రి కుమారులం. అందువల్ల మనం ఇప్పుడు ఊరికే ఉండకూడదు. పింగళకుడి దగ్గరికి పోయి, ఆయన భయాన్ని మాన్పాలి. ఈ వంకతో అయినా మనం ఆయన దగ్గర ఉద్యోగం సంపాదించుకొని, ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు. రాజు అనుగ్రహం పొందిన వాళ్లకు సర్వసంపదలూ కలుగుతాయి. మనం ఆయనను గతంలో తిరస్కరించాం. ఇప్పుడు మనకు ఆయన అనుగ్రహం సంపాదించటమే ముఖ్యం- మిగిలిన మూర్ఖపు సంగతులు మనకేల?" అన్నది.

ఆ మాటలు విని కరకటం "దమనకా, విను. ఇతనితో స్నేహం నాకు సరిపోదు. ఇది వరకు ఇతని వద్ద పనిచేసి పడ్డ పాట్లు చాలు. ఇతను 'ఎత్తు వారి చేతి బిడ్డడు' -ఎవరెట్లా చెప్తే అలా చేస్తాడు- తప్ప, ఒక దారిన పోయేవాడు కాదు.

ఇట్లాంటి వాడి దగ్గర కొలువు చాలా కష్టం. అయినా అది ప్రక్కనపెట్టు- 'జానెడు కడుపు నింపుకోవటం కోసం ఇతరులకు శరీరాన్ని అమ్ముకోవటం' అన్నది చాలా నీచం. ఇతరుల ఆధీనంలో నడిచేవాడు చచ్చినవాడితో సమానం. అయినప్పటికీ సేవకుడు స్వీయ కార్యాల చేత యజమాని మెప్పుకోలు సంపాదిస్తే, ఆ సేవ వల్ల కల్గిన దు:ఖం కొంత వరకు ఉపశమిస్తుంది. అలా కాక యజమాని అతనిని పట్టించుకొనకపోతే, దాని కంటే దు:ఖం వేరే లేదు. యజమానే గనక ఆ సేవకుడిని పరాభవిస్తే, ఇక చెప్పవలసినది ఏమున్నది? సేవా వృత్తి వల్ల లభించే పాయసం కంటే, స్వతంత్రంగా పనిచేసుకుంటూ సంపాదించుకొనే గంజి మేలు.

అందువల్ల , దొరికిన లాభంతో తృప్తి పడి సుఖంగా ఉందాం. అతని భయాన్ని పోగొట్టవలసిన అవసరం మనకు ఇప్పుడు ఏమున్నది? తనకు మాలిన పనిని నెత్తికెత్తుకున్న వాడు మేకును పెరికిన కోతిలాగా తప్పక ఆపదల పాలవుతాడు. ఆ కథ చెబుతాను, విను-

మగధ దేశంలో 'అరిదుర్గం' అనే పట్టణం ఒకటి ఉండేది. అందులో 'శుభదత్తుడు ' అనే వైశ్యుడు ఒకడు, మహా ధన సంపన్నుడు- ఉండేవాడు. అతనికి పిల్లలు లేరు. అందువల్ల అతను తన సంపదను మొత్తాన్నీ ఉద్యానవనాలకోసం, చెరువులకోసం, ప్రజలకు ఉపయోగపడే ఇతర కార్యకలాపాలకోసం, ఖర్చుపెట్టేవాడు. ఆ పట్టణంలోనే గొప్ప దేవాలయం ఒకటి శిథిలమై ఉండగా చూసి, శుభదత్తుడు మంచి వడ్రంగులను పిలిపించి, వాళ్ళకు తగిన జీతాలిచ్చి, ఆ గుడిని మళ్ళీ నిర్మించమన్నాడు.

ఆ వడ్రంగులు గుడిని కడుతుండగా, ఒకనాడు వాళ్ళకు పెద్ద చేవ దూలం కావలసి వచ్చింది. వండ్రంగుల పెద్ద, ఒక పెద్ద మ్రానును తెప్పించి, దానిని రంపంతో కోయిస్తూ, అది సులభంగా చీలేందుకుగాను దానిలోకి అక్కడక్కడ కొయ్య మేకులు దిగగొట్టాడు. అంతలో మధ్యాహ్నం అవ్వటంతో, అతను- కూలివాళ్ళు- అందరూ పనిని ఆపి,

భోజనంకోసం వెళ్ళిపోయారు.

అప్పుడు ఆ చుట్టుప్రక్కల చెట్లమీద తిరుగాడుతున్న కోతులు దేవాలయం దగ్గరికి వచ్చి- గోడలు ఎక్కుతూ, వాటిని ఆనుకొని ఉన్న చెట్ల మీదకి కుప్పించి దూకుతూ, వ్రేలాడే కొమ్మల్ని కాళ్లతో పట్టుకొని తలకిందులుగా వ్రేలాడుతూ, పెద్ద కొమ్మలను రెండు చేతులతో బట్టి ఊపుతూ, దేవాలయ గోపురం పైన ఉండే వివిధ అంతస్తుల పైన కూర్చొని- వికారంగా ప్రక్కలు, వీపులు గోక్కొంటూ, నిక్కుతూ, కనుబొమ్మలెత్తి గుర్రుమని బెదిరిస్తూ, పండ్లు ఇకిలిస్తూ, వెక్కిరిస్తూ, ఒకదానినొకటి తొడలమీద కూర్చోబెట్టుకొని, శరీరం మీద ఉన్న పేనులను ఏరి నోట్లో వేసుకుంటూ, కిల కిలమని అరుస్తూ, ఒకదానితో ఒకటి పోరాడుతూ, పండ్లను తింటూ, తేనెను త్రాగుతూ, అలా తమదైన చపలత్వంతో అటూ ఇటూ తిరుగాడసాగాయి.

వాటిలో ఒక ముసలి కోతికి కాలం మూడింది. అది వేరే ఏమీ పని లేనట్లు చేవదూలం దగ్గరకు పోయి, దానిమీదకి ఎక్కి కూర్చున్నది. దాని చీలికలో తన తోకను జార విడిచింది. ఆ పైన అది ఆ చీలికలో బిగియగొట్టిన కొయ్య మేకును ఒక దానిని రెండు చేతులతోటీ పట్టి, బలంగా ఊపి- ఊపి- చివరికి పూర్తిగా ఊడబెరికింది.



కొయ్యమేకు వీడిన మరుక్షణం అంతవరకు నెరి విచ్చిన ఆ చేవమ్రాను తిరిగి యథా స్థితికి చేరుకున్నది. చేలికలో వ్రేలాడుతున్న కోతి తోకతో పాటు క్రింది భాగాలన్నీ మ్రానులో ఇరుక్కుపోయాయి. చివరికి ఆ కోతి బాధతో ఏడుస్తూ చనిపోవాల్సి వచ్చింది. కాబట్టి, 'తనకు మాలిన పనికి పోరాదు'.

-మనం ఇప్పుడు పింగళకుడి అనుచరులం

కాదు. అతని కొలువులో క్రొత్త ఉద్యోగులు అనేకమంది ఉన్నారు. 'తమ యజమానికి ఏది మేలు, ఏది కీడు' అనే ఆలోచన, వారికి ఉండాలి- తప్ప, మనకు ఆ అధికారం లేదు. ఇతరుల పనులను నెత్తిన వేసుకున్నవాడు 'ఓండ్రపెట్టి చచ్చిన గాడిద' లాగా నశిస్తాడు. ఆ కథ చెబుతాను- శ్రద్ధగా విను-

"వారణాసి నగరంలో ధావక మల్లుడు అనే చాకలివాడు ఒకడు ఉడేవాడు. ఒక రోజున అతను చాలా బట్టలు ఉతికీ ఉతికీ అలసిపోయాడు. ఆ అలసట వల్ల అతనికి ఆనాటి రాత్రి మంచిగా నిద్ర పట్టింది. అతను ఆవిధంగా ఒళ్ళు మరచి, గుర్రుకొట్టి నిద్రిస్తున్న సమయంలో అతని ఇంట్లోకి ఒక దొంగ చొరబడ్డాడు.

అప్పుడు ఇంటి వాకిట్లోనే ఉన్నది గాడిద- యజమాని దాని కాలికి త్రాడు కట్టి ఇంటి వాకిటిలోనే ఉంచాడు. వాళ్ల ఇంటి కావలి కుక్క కూడా గాడిద ప్రక్కనే కూర్చొని ఉన్నది. దొంగను చూసి కూడా కుక్క మొరగలేదు. అప్పుడు ఆ గాడిద- కుక్కల మధ్య సంభాషణ ఇలా సాగింది-

గాడిద : దొంగ లోనికి చొరబడ్డాడు, చూశావా?

కుక్క: చూశాను, చూశాను!

గాడిద: మరి, ఎందుకు మొరగట్లేదు?

కుక్క: నేనేం చేస్తే నీకేమి? నా పనితో నీకెందుకు?

గాడదః: యజమాని ఇల్లు గుండెం అవుతుంటే ఊరికే చూస్తూ కూర్చోన్నావా, తప్పు కాదూ?

కుక్క: "నీకేం తెలుసు? ఇన్నేళ్ళుగా రాత్రింబవళ్లూ ఒక్క నిమిషం కూడా వృథా పోనీక, చాలా శ్రద్ధతో, తలవాకిలి వదలక- ఈ ఇంటిని కాచు కొని ఉన్నాను నేను. అయినా నా వల్ల కలుగుతున్న మేలును, నా ఉపయోగాన్ని గుర్తించక, యజమాని నన్ను చిన్న చూపు చూస్తున్నాడు. తినేందుకు నాకు పుడిసెడు అన్నం దొరకటంలేదు. సేవకుడి కష్టం ఎరుగని యజమానిని సేవించడం కంటే ఊరకుండటం మేలు".

కుక్క మాటలు విని గాడిదకు చాలా కోపం

వచ్చింది. అది అన్నది "ఓరీ! దురాత్మా! విను! ఏదైన కష్టం వచ్చినప్పుడు యజమాని తప్పుల్ని లెక్కబెట్టి సహాయం చెయ్యకుండా ఊరుకోవటం సేవకుడికి భావ్యం కాదు. అంతేకాదు- యజమాని మేలును గుర్తించకుండా తన పనుల్ని తాను చేసుకుంటూ ఉండిపోయే సేవకుడిని 'కృతఘ్నుడు' అంటారు. నీకు పాపం ఆంటే ఇష్టం అనిపిస్తున్నది. ఆపద కలిగినప్పుడు యజమానికై చేయవలసిన పనిని నువ్వు ప్రక్కన పెడుతున్నావు. అయినా ఏదో ఒరుగుతుందనుకోకు- నువ్వు చేసే పని నాకు రాదా? చూడు, మన యజమానిని ఇప్పుడు నేను మేల్కొలుపుతాను!" అని చెప్పి, గట్టిగా ఓండ్రపెట్టింది.

ఆ శబ్దానికి చాకలివాడు మేలుకొన్నాడు. తన నిద్రను పాడు చేసిందని గాడిదపైన మహా కోపంతో లేచాడు. ఒక పెద్ద కట్టెను పట్టుకొని, పరుగెత్తుకొని వచ్చి, దానితో గాడిదను బాదాడు. ఆ దెబ్బ ఆయువుపట్టులో తగలటం వల్ల, గాడిద అక్కడికక్కడే చచ్చిపోయింది.

కాబట్టి, ఇతరుల పనిని మనం నెత్తికి ఎత్తుకోకూడదు- అక్కడక్కడా తిరిగి, పశువుల కళేబరాలను వెతకటం మన పని. ఆ పనిని మానేసి, పనికిరాని ఈ ఆలోచనలు ఎందుకు? వేరే జంతువులు తినగా మిగిలిన మాంసం కావలసినంత ఉన్నది- రా, తిందాం! అన్నది.



పొడుపుకథ

కొనేటప్పుడు నల్లన-
వాడేటప్పుడు ఎర్రన-
పడేసేటప్పుడు తెల్లన!
ఏమిటది?

(జవాబు: బొగ్గు!)



కాకి-నక్క

రచన: T. ఆమని, 6 వతరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి

ఒక అడవిలో చాలా తెలివైన కాకి ఒకటి ఉండేది. దానికి ఒకరోజున మాంసపు ముక్క ఒకటి దొరికింది.

అది ఒక చెట్టు కొమ్మమీద కూర్చొని , తీరికగా దాన్ని తినేందుకు సిద్ధమౌతున్నది.

అప్పుడే అటువైపుగా పోతున్న నక్క, తలెత్తి పైకి చూసింది.

మాంసపు ముక్కను పట్టుకున్న కాకి కనబడింది దానికి.

నక్కకు నోట్లో నీళ్లూరాయి. 'కాకిని ఎలాగైనా మోసంచేసి, మాంసపు ముద్దను కొట్టేద్దాం' అనుకున్నది.

"కాకమ్మా! కాకమ్మా!" పిలిచింది నక్క.

కాకి తినటం ఆపి, నక్క వైపు చూసింది.

"నువ్వు ఎంత బాగా పాడతావు కాకమ్మా! నీ పాట వినాలని, నిన్ను వెతుక్కుంటూ వచ్చాను"

అన్నది నక్క.

"అబ్బ! అప్పుడే చూసేశావన్నమాట, నా మాంసం ముక్కని" అనుకున్నది కాకి.

"చక్కగా పాడవమ్మా, ఓ పాట, మా చక్కని కాకమ్మా" అన్నది నక్క, కాకిని ఉబ్బిస్తూ.

కాకి మాంసం ముక్కని నోట్లోంచి తీసి, కాలి సందుల్లో పెట్టుకున్నది. ఆపైన చాలా మామూలుగా "కావ్! కా..వ్! కా....వ్!!" అని అరిచింది.

'క్రిందికి పడాల్సిన మాంసంముక్క పడలేదేమిటా' అని ఆశ్చర్యపోయింది నక్క.

కాకి తెలివిని చూసి కొంచెం కలవరపడింది.

"అబ్బబ్బ! ఎంత చక్కగా పాడావమ్మా! అలాగే నీ చక్కని అడుగులతో నాట్యం కూడా చెయ్యమ్మా! నా కనుల నిండుగా చూసేసి పోతాను" అన్నది నక్క, తెలివిని ప్రదర్శిస్తూ.

"అయ్యో, నక్కా! నీ గురించిన కథని మా అమ్మమ్మ ఎన్ని సార్లు చెప్పిందో లెక్కలేదు. ఇంకా నేను మోసపోతాననుకున్నావా?" అనుకున్నది కాకి.

మాంసం ముక్కని తీసి నోట్లో పెట్టుకొని, గాలిలోకి ఎగిరి పల్టీ కొట్టి, అటూ ఇటూ ఊగి, విన్యాసాలు చేసి చూపించింది నక్కకు.

'మాంసం ముక్క ఇంకా దొరకలేదేమా' అని నక్కకు విచారం వేసింది. అయినా పైకి కనబడనివ్వలేదు. అన్నది-

"అయ్యయ్యో, కాకమ్మా! నీ ఆటకి తోడుగా నీ పాటే ఉంటే ఎంత బాగుంటుందమ్మా! ఒకేసారి ఆడి, పాడి నన్ను మురిపించమ్మా, ఓ చక్కని బొమ్మా!" అన్నది.

కాకి ఆలోచించింది:

మాంసం ముక్కని తీసి, జాగ్రత్తగా చెట్టు కొమ్మల్లో ఇరికించి పెట్టింది.

"కావ్! కా..వ్!" మని పాడుతూ, సంతోషంగా ఎగిరి గంతులు వేసింది. "నీ జిత్తులిక సాగవు నక్క బాబూ! ఇక ఇంటికి పో, మాంసం నీకు ఎలాగూ దొరకదు!" అన్నది.

తన ఆటలు సాగనందుకు విచారపడుతూ నక్క ముందుకు సాగిపోయింది.

కాకి నవ్వుకొని, మాంసం ముక్కను మెల్లగా కొరుక్కుని కొరుక్కుని తిన్నది.

నెమలి కల

రచన: M.చంద్రశేఖర్, 10 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.

కనగానపల్లి చుట్టూతా రమణీయమైన ప్రకృతి ఉండేది. అడవి, కొండలు, వాగు-వంకలతో ఆ ప్రదేశం పచ్చగా కళకళలాడుతూ ఉండేది. ఊరి ప్రజలంతా అడవులపైనే ఆధారపడి జీవిస్తూ ఉండేవాళ్ళు. ఆ ఊళ్ళో సిసింద్రి- విష్ణు అనే అన్నదమ్ములిద్దరు నివసిస్తూ ఉండేవాళ్ళు.

సిసింద్రి-విష్ణులకు ఇద్దరికీ అడవి అంటే చాలా ఇష్టం. అయితే బడికి వెళ్ళే పిల్లలు కావటంతో అడవికి వెళ్ళేందుకు పెద్దగా సమయం చిక్కేది కాదు. అడవిలో ఉండే పక్షులు, జంతువుల్ని చూడటం, అడవిలో దొరికే రకరకాల పండ్లు తినటం, అలా ఊరికే నడుచుకుంటూ పోవటం - ఇవన్నీ వాళ్ళిద్దరికీ బలేగా అనిపించేవి.

ఒకరోజున, వాళ్ల బడికి అనుకోకుండా శలవు ఇచ్చారు. సిసింద్రి-విష్ణులు ఇద్దరూ 'ఏం

చేద్దామా?' అని ఆలోచించి, అడవికి వెళ్ళొద్దామనుకున్నారు. అక్కడ ఒక వంకలో చాలా సేపు ఈతకొట్టి, దగ్గర్లోనే ఉన్న ఈత చెట్లోంచి పళ్ళు కోసుకొని తిన్నారు. అంతలో విష్ణుకు ఒక నెమలి కనబడింది. మెరిసిపోయే పింఛంతో, నిగనిగలాడే ఈకలతో, నేలబారున, ఈడుస్తూ పోయే తోకతో ఉన్న ఆ నెమలి, సంతోషంగా అరుస్తూ నాట్యం చేయటం మొదలు పెట్టింది! అప్పటివరకూ వాళ్లకు ఆ అడవిలో నెమళ్లున్నాయని తెలీనే తెలీదు- ఇప్పుడు అకస్మాత్తుగా నెమలి కనబడటంతో ఇద్దరూ ఆశ్చర్యంతో నిశ్చేష్టులైపోయి, గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు.

"అన్నా! అన్నా! నాకొక నెమలి ఈక కావాలి!" అన్నాడు విష్ణు గుసగుసగా. "దాని ముక్కు చూడరా, ఎంత గట్టిగా ఉందో! ఒక్క పోటు పొడిచిందంటే అంతే సంగతులు!" అన్నాడు సిసింద్రి. "మరి సుబ్బుగాడి దగ్గర ఒక మంచి నెమలి ఈక ఉన్నది గదా, అదెట్లా వచ్చింది?" అడిగాడు విష్ణు. "వాళ్ల నాన్న ఏమైనా వేటగాడో, ఏమో మరి? లేకపోతే నెమలే వాడికి ఒక ఈకను ఇచ్చిందేమో?" అన్నాడు సిసింద్రి. "మనకూ ఒక ఈకని ఇమ్మందాం- ఏం చేస్తుందో చూద్దాం" అని, విష్ణు పొదల్లోంచి ముందుకు పరుగెత్తాడు. అయితే అలికిడి వినగానే తలత్రిప్పి చూసిన నెమలి, పెద్దగా అరుచుకుంటూ చెట్టుమీదికి ఎగిరి, గబ గబా ఎటో వెళ్ళిపోయింది!

విష్ణు నిరాశచెందాడు. ఆ నిరాశలో ఎటో చూసుకుంటూ నడుస్తున్న వాడికి, ఒక నేరేడు చెట్టును చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లైంది. గబగబా నేరేడు చెట్టు దగ్గరికి పరుగెత్తారు ఇద్దరూ- అయితే చెట్టు పెద్దగా ఉంది, చాలా నునుపుగా కూడాను! దానిక్రింద మామూలుగా పడి ఉండాల్సిన నేరేడు పళ్ళేవీ, ఎందుకోమరి, ఒక్కటీ లేదు! "చెట్టుపైకి రాళ్ళు వేద్దామా?" అన్నాడు విష్ణు ఆశగా. "వద్దు వద్దు- పాపం చెట్టుకు దెబ్బ తగిలి నొప్పి పుడుతుంది" అన్నాడు సిసింద్రి. "మరి ఎట్లాగైనా నెమలిని వెతికి పట్టుకొని, ఒక ఈక పీకి ఇవ్వు" మారాం చేశాడు విష్ణు. "తప్పు తమ్ముడూ! చెట్టుమీదికి రాళ్ళు వేస్తే చెట్టుకు నొప్పి పుడుతుంది; ఈకలు

పీకితే నెమలికి నొప్పి పుడుతుంది!' అన్నాడు సిసింద్రి- "సాయంత్రం అవుతున్నది- పద ఇంటికి పోదాం" అని లేస్తూ.

విష్ణుకు అస్సలు అడవిని వదిలి పోబుద్ధి కాలేదు. "అయినా అన్న నిర్ణయం! వెళ్లక తప్పదు! సాయంత్రం అవుతున్నది! నెమలికి నొప్పి పుడుతుంది! చెట్టుకూ నొప్పి పుడుతుంది!"- ఇవే ఆలోచనలు నడుస్తూండగా, వాడూ అన్నవెంబడి నడిచి, ఇల్లు చేరుకున్నాడు.

అదే సంగతి ఆలోచిస్తూ పడుకున్న విష్ణుకు ఆరోజు ఒక కల వచ్చింది: అడవిలో కనబడ్డ నెమలి వాళ్ళ ఇంటికి వచ్చింది! అది తినేందుకు ఏం తెచ్చుకున్నదో తెలుసా? నేరేడు పళ్లు! చాలా నేరేడు పళ్ళు తెచ్చుకొని, అది వాళ్ళింటి గడపమీదే పెట్టుకొని తిన్నది. అంతలో చిన్న చిన్నగా వాన మొదలైంది. ఇంటి ముందు జలజలా వాన పడుతుంటే ఆ నెమలికి చాలా సంతోషం వేసింది. వెంటనే అది పురి విప్పి, ఎంతో అందంగా నాట్యం చేసింది! చేసీ చేసీ అలిసిపోయి, అది ఒక ఈకను అక్కడే వదిలేసి అడవిలోకి వెళ్ళిపోయింది!

నవ్వుముఖంతో నిద్రలేచిన విష్ణును చూసి అమ్మ మురిపెంగా "ఏమిరా, విష్ణూ! నేరేడు పళ్ళు బాగా తిన్నట్లున్నావే, ఇంటి ముందంతా విత్తనాలు పడేశావేంటి?" అన్నది. విష్ణు గబగబా లేచి పరుగెత్తుకొని పోయి చూశాడు- నిజమే.. ఇంటి ముందంతా నేరేడు పళ్ళ విత్తనాలు పడి ఉన్నై! ఇంటి ముందు నేలమీద అంతా కోళ్లు తిరుగాడినట్లు కాలి గుర్తులున్నై.. వెతికి చూడగా వాడికి ఒక నెమలీక దొరికింది కూడాను!!

మారిన మనసు

రచన: C.కృష్ణవేణి, 7 వ తరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.

అనగా అనగా ఒక ఊరు . ఆ ఊరి పేరు ఒంటికొండ. ఆ ఊళ్ళో ఒక బడి ఉంది. ఒక రోజున ఆ బడిలో పాటల కార్యక్రమం జరుగుతున్నది. ఆ పాటల్ని వినేందుకు చాలా మంది వచ్చి ఉన్నారు. పాటలు పాడటానికి పిల్లలంతా పోటీ పడుతున్నారు. అయితే, ఆ బడిలో చదివే భీమరాజు 'అమ్మ' గురించి పాడిన పాట విని, అందరూ పరవశించిపోయారు. ఎప్పటిలాగే ఈసారి కూడా భీమరాజుకే మొదటి బహుమతి వచ్చింది. ఆ బహుమతిని పట్టుకొని భీమరాజు సంతోషంగా ఇంటికి పరుగెత్తాడు.

భీమరాజు వాళ్ళది చాలా పేద కుటుంబం. అతను చిన్నగా ఉన్నప్పుడే వాళ్ళ నాన్న చనిపోయాడు. అప్పటినుండీ వాళ్ళ అమ్మ కూలిపని చేసుకుంటూ అతన్నీ, వాళ్ల అన్ననీ పెంచి పెద్ద చేసింది. అన్నకు పెళ్ళైంది; చిన్న ఉద్యోగం దొరికింది- గానీ అతని సంపాదన అతని కుటుంబానికే సరిపోతుంది. భీమరాజు

చదువు పూర్తయేంత వరకూ వాళ్ళమ్మకు చాకిరీ తప్పదు.

సంతోషంగా ఇల్లు చేరుకున్న భీమరాజు వాళ్ళమ్మకు తన బహుమతిని చూపించి- 'నువ్వు నేర్పిన పాటకేనమ్మా, ఈ బహుమతి వచ్చింది!' అని చెబితే, వాళ్ళమ్మ గర్వంతో పొంగిపోయింది. 'సరే, నువ్వు వెళ్ళి స్నానం చేసి, రా! ఇవాళ్ల నీ పుట్టిన రోజు కదా, కొత్త అంగీ కుడుతున్నాను. నీ స్నానం అవ్వగానే ముందు కొంచెం పాయసం తిందువు' అన్నది. అయితే, ఆమెకు చాలా కాలంగా కాన్సర్ వ్యాధి ఉన్నది. అదే రోజు సాయంత్రం ఆమె చనిపోయింది!

ఇప్పుడు ఇక భీమరాజును చూసుకునే బాధ్యత వాళ్ల అన్నమీద పడింది. అన్న మంచివాడే, కానీ ఒదిన గంగమ్మకు మాత్రం భీమరాజంటే ఇష్టం ఉండేది కాదు. ఆమె ఎప్పుడూ అతన్ని సాధిస్తూ ఉండేది. భీమరాజు మాత్రం నోరు మెదపకుండా ఇంటి పనులన్నీచకచకా చేసేసి బడికి వెళ్ళి శ్రద్ధగా చదువుకొనేవాడు. బడినుండి ఇంటికి వచ్చాక కూడా అతనికోసం ఇంటినిండా పనులు సిద్ధంగా ఉండేవి. అన్ని పనులూ చేసేసి, అందరూ భోజనాలు కానిచ్చి పడుకున్నాక, భీమరాజు తన హోం-వర్కు చేసుకునేవాడు. ఎంత చేసినా వదిన చేతిలో అతనికి తిట్లు తినక తప్పేది కాదు.

చూస్తూండగానే సంవత్సరం గడిచి-పోయింది. బడిలో పాటల పోటీలు జరుగుతున్నై, మళ్ళీ. ఆ పోటీని చూసేందుకు భీమరాజు అన్నావదినలు కూడా వచ్చారు. 'ఈసారి భీమరాజు ఏం పాట పాడతాడా ' అని అందరూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. 'అన్నా వదినల ఆప్యాయత' అని తీయగా పాడాడు భీమరాజు. పాట ఎంత చక్కగా పాడాడంటే, న్యాయనిర్ణేతలుకూడా అతన్ని ప్రశంసించకుండా ఉండలేకపోయారు. ఒకాయన వాడిని దగ్గరకు తీసుకొని, ప్రేమగా 'బాబూ, నీకు ఈ పాటను ఎవరు నేర్పారు? ఇంత చక్కగా పాడేందుకు నీకు స్ఫూర్తినిచ్చింది ఎవరు?' అని అడిగాడు. 'మా ఒదినమ్మ' అని చెప్పాడు భీమరాజు. న్యాయనిర్ణేతలు భీమరాజు ఒదినమ్మను వేదిక మీదికి పిలిచి,

అభినందించి, ప్రత్యేకంగా సత్కరించారు. 'ఇంత చక్కని గాయకుడిని తయారుచేసిన మీరు ధన్యులు' అని వచ్చినవాళ్ళంతా ప్రశంసిస్తుంటే ఒదినమ్మ సిగ్గుతోముడుచుకు పోయింది.

అటు తర్వాత గంగమ్మ మారిపోయింది. భీమరాజును చక్కగా చూసుకున్నది!



జోకులు

ఒకే కుక్కలు!

టీచరు గారు: రామూ! కుక్క గురించి నువ్వూ, రవీ ఖచ్చితంగా ఒకేలాగా ఎలా రాసారంటావు? కాపీ కొట్టారు కదూ?

రాము: లేదు టీచర్! మేమిద్దరం ఒకే కుక్క గురించి రాశాం అంతే.

నువ్వే నేను!

తల్లీ- బిడ్డ మాట్లాడుకుంటున్నారు:

బిడ్డ: అమ్మా! నీ జుట్టు అక్కడక్కడా తెల్లగా అయింది- ఎందుకు?

తల్లి: ఏంలేదమ్మా! నువ్వు అల్లరి చేసి, నాకు కోపం తెప్పించినప్పుడు ప్రతిసారీ నా వెంట్రుక ఒకటి తెల్లగా ఐపోతున్నది.

బిడ్డ: (కొంచెం సేపు ఆలోచించి) మరి, అమ్మా! అమ్మమ్మ జుట్టు పూర్తిగా తెల్లగా అయింది- ఎందుకు?

విష్ణు సాహసం

రచన: H.సిసింద్రి, 10 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.

అనగా అనగా ఒక ఊరు ఉండేది. ఆ ఊళ్ళో విష్ణు అనే పిల్లవాడు ఉండేవాడు. అతను రోజూ గొర్రెల్ని తోలుకొని కొండమీదికి వెళ్ళేవాడు. ఒక రోజున అతను ఎప్పటిలాగే గొర్రెల్ని వెంట బెట్టుకొని కొండ ఎక్కుతుండగా, అకస్మాత్తుగా ఒక ఎలుగు బంటి ఎదురయింది. ఏంచేయాలో అర్థం కాని విష్ణు గాభరా పడి, ఎటు తోస్తే అటు పరుగెత్తాడు.

ఒకసారి ఎలుగుబంటినుండి తప్పించుకున్న తర్వాతగానీ అతని ప్రాణం కుదుట పడలేదు. ఇక అలా పోతా పోతా ఉంటే అతనికి ఒక కుందేలు ఎదురైంది. ఎలాగైనా ఆ కుందేలును పట్టుకుందామని, అతను దాని వెంట పడ్డాడు. విష్ణును చూసి అది మరింత వేగంగా దుముక్కుంటూ పోయింది- చివరికి ఏవో పొదల్లోకి దూరి ఇక కనిపించలేదు.

ఆ సరికి సాయంత్రం అయ్యింది. "చూడు, ఎలుగు బంటిని చూసి నేను పారిపోయాను, నన్ను చూసి కుందేలు పారిపోయింది" అని నవ్వుకుంటూ విష్ణు ఇల్లు చేరుకున్నాడు.

ఇల్లు చేరుకున్నాక, వాళ్ళ నాన్న అడిగాడు- "ఒరే, విష్ణూ! గొర్రెలు ఏవిరా?" అని! అప్పుడు గానీ విష్ణుకు తమ గొర్రెలు గుర్తుకు రాలేదు! వాడు బిక్క ముఖం వేసుకొని, వాళ్ళ నాన్నకు జరిగిన సంగతంతా చెప్పాడు. అప్పుడు వాళ్ల నాన్న నిట్టూర్చి, "సరే, ఏంచేస్తాం, ఇప్పుడు మనిద్దరం వెళ్ళి గొర్రెల్ని వెతికి, వెనక్కి తోలుకు రావలసిందే, పద!" అని టార్చిలైటు పట్టుకొని బయలు దేరాడు.

"ఎలాగో ఒకలాగా గొర్రెలు దొరికితే చాలు దేవుడా! ఈసారినుండీ ఎప్పుడూ భయపడను, అపాయం ఎదురైతే ఉపాయం ఆలోచిస్తాను గానీ, ఇట్లా పిరికి వాడిలాగా పారిపోను" అనుకుంటూ, వాళ్ల నాన్నతోబాటు నడక సాగించాడు విష్ణు.

తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి కొండను చేరుకునే సరికి, అప్పుడప్పుడే చీకటి పడుతున్నది. కొండ ఎక్కటం మొదలెట్టారు ఇద్దరూ. "ఎలుగు బంట్లు ఒక చోటును అంటి పెట్టుకొని ఉండవు. ఇంతకు ముందు కనబడ్డ చోట ఇప్పుడు అది ఉంటుందని భయపడనక్కర్లేదు" అని చెప్పుతూ పోతున్నాడు విష్ణు వాళ్ళ నాన్న.

అయితే ఎలుగుబంటి అక్కడే ఉన్నది! ఒక్కసారిగా అది వీళ్ళ ముందుకు దూకింది! అప్పటి వరకూ ధైర్యంగా ఏవేవో చెబుతున్న విష్ణువాళ్ళ నాన్న, ఆ ఎలుగు బంటిని ఎదురుగా చూడగానే భయంతో కళ్ళు తిరిగి పడిపోయాడు! విష్ణుకైతే నోరు ఎండిపోయింది.. ప్రాణం గడ్డకట్టుకుపోయింది. పారిపోయేందుకు కూడా అడుగులు రాలేదీసారి.

అయితే వెంటనే తేరుకున్న విష్ణు చురుకుగా ఆలోచించాడు. గబుక్కున వంగి, వాళ్ల నాన్న జేబులోంచి అగ్గిపెట్టె తీసుకున్నాడు. అగ్గిపుల్లను అంటించాడు. అగ్గిపుల్ల "బుస్" మని వెలగ్గానే ఎలుగుబంటి వింతగా చూసింది. వెంటనే విష్ణు దగ్గర్లో పడి ఉన్న ఒక కాయితాన్ని

ముట్టించాడు. కాయితం అంటుకుని మంట రాగానే, ఎలుగుబంటి ఒక అడుగు వెనక్కి వేసింది.

మరుక్షణం విష్ణు క్రిందికి వంగి, టార్చిలైటును చేతిలోకి తీసుకున్నాడు- దాన్ని ఆన్ చేసి, వెలుతురు సరిగ్గా ఎలుగుబంటి కళ్ళల్లో పడేట్లు పట్టుకున్నాడు. ఎలుగుబంటికి కొద్ది సేపు కళ్ళు కనబడలేదు. ఆ లోగా విష్ణు క్రింద పడేసిన కాగితం చుట్టు ప్రక్కల ఉన్న గడ్డి అంటుకోనారంభించింది. నిప్పును చూసిన ఎలుగుబంటి భయపడి, వెనక్కి తిరిగి పారిపోయింది!

అలా ప్రమాదం తప్పాకగానీ విష్ణు వాళ్ళ నాన్నకు తెలివి రాలేదు. ఆపైన వాళ్ళిద్దరూ నేలమీద పరుచుకుంటున్న నిప్పును ఆర్పేసి, టార్చి వెలుగులో తమ గొర్రెల్ని వెతుక్కొని, మెల్లగా ఇల్లు చేరుకున్నారు! సంగతి తెలిసి, ఊళ్ళో జనాలంతా వచ్చారు. అందరూ విష్ణు ధైర్యాన్నీ, సమయస్ఫూర్తినీ మెచ్చుకున్నారు.

ప్రార్థన!

జోకు

చర్చిలో ఫాదరు గారు: పీటర్! ప్రతి రోజూ భోజనం చేసే ముందు ప్రార్థన చేసుకుంటున్నావా, లేదా?

పీటర్: అవసరం లేదు ఫాదర్! మా అమ్మ వంట బాగానే చేస్తుంది.

ఫాదర్: !!!!

వెర్రి వెంగళప్ప

సేకరణ: ఏ. స్టీఫెన్, 8 వ తరగతి, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, చెన్నేకొత్తపల్లి.

అనగనగా ఒక ఊరు ఉండేది. ఆ ఊరు పేరు రామాపురం. ఆ ఊళ్లో ఒక వెర్రి వెంగళప్ప ఉండేవాడు. వానికి ఒక అవ్వ ఉండేది. అవ్వకి అతనంటే ఇష్టం; అతనికి అవ్వ అంటే ఇష్టం.

ఒకసారి అవ్వకి జ్వరమొచ్చింది. చాలా రోజులుగా అట్లాగే ఉంది. అప్పుడు మనవడికి చాలా బాధ అయ్యింది. ఎలాగైనా అవ్వ ఆరోగ్యం బాగు చేపించాలని అనుకుంటాడు. వైద్యానికి చాలా సంపాదించాలని అనుకుంటాడు. అందుకోసం ప్రక్క నగరంకి వెళ్ళాడు.

వెంగళప్ప నగరానికి వెళ్ళి, రెండు రూపాయలు సంపాదించాడు. తిరిగి వచ్చేటప్పుడు, నది దాటించటంకోసం పడవ వాడికి ఒక రూపాయి ఇచ్చాడు. ఇంకొక రూపాయిని చేతిలో పట్టుకొని, ఊరికే ఉండకుండా గాలిలోకి ఎగరెయ్యటం మొదలు పెట్టాడు. అట్లా ఎగరేసుకుంటుంటే అది

నదిలో పడిపోయింది. అతనికి చాలా బాధ అయ్యింది. ఇంటికి వెళ్ళగానే అవ్వ 'ఏమి సంపాదించావురా, మనవడా?' అని అడిగింది. "నేను ఒక రూపాయి పడవ వానికి ఇచ్చి, ఒక రూపాయి ఎగర వేసుకుంటూ వస్తుంటే అది నదిలో పడిపోయింది" అని చెప్పాడు వెంగళప్ప. "ఒరేయ్! అలాంటిది జేబులో వేసుకుని రావాలి" అని చెప్పింది అవ్వ.

మరుసటి రోజు వెంగళప్ప నగరానికి వెళ్ళి, నెయ్యి దుకాణంలో పని చేశాడు. కూలీగా అతనికి కిలో నెయ్యి ఇచ్చాడు దుకాణదారు. ఇంటికి బయలుదేరిన వెంగళప్పకు అవ్వ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. నెయ్యినంతా తన జేబుల్లో కుక్కుకొని బయలుదేరాడు. అతను ఇంటికి చేరుకునే లోపు నెయ్యి కరిగి పోయింది. జరిగింది తెలుసుకుని, "అలాంటి దాన్ని గిన్నెలో వేసుకుని రావాలిరా, నాయనా!' అని చెప్పింది అవ్వ.

ఈసారి వెంగళప్ప మేకల్ని మేపే పనికి కుదురుకున్నాడు. కొన్ని రోజులు పని చేసిన మీదట, యజమాని కూలీగా ఒక చిన్న మేక పిల్లను ఇచ్చాడు. మేకపిల్లను ఇంటికి తెద్దామని బయలుదేరిన వెంగళప్పకు అవ్వ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. దాన్ని గిన్నెలోకి ఎంత కుక్కినా పట్టలేదు. చివరికి వాడు దాన్ని ఒక గోతంలో వేసుకుని, ఇంటికి మోసుకొచ్చాడు. ఇంటికి వచ్చేసరికి మేక చనిపోయింది. అప్పుడు అవ్వ ' అయ్యో! అలాంటి దాన్ని తాడుతో కట్టుకుని రావాలి బాబూ!' అని చెప్పింది.

ఈసారి వాడికి ఒక పెద్ద చేప దొరికింది. అవ్వ మాటల్ని గుర్తుంచుకొని, వాడు దానికి భద్రంగా ఒక తాడు కట్టి, దాన్ని ఇంటి వరకు ఈడ్చుకొచ్చాడు. ఇంటికి వచ్చే సరికి ఎముకలు మాత్రం మిగిలాయి. మాంసం మొత్తం ఎక్కడికి పోయిందో కూడా అంతు చిక్క లేదు! 'ఓరి బాబూ ! ఇలాంటి దాన్ని లాక్కు రారు నాయనా! ఎత్తుకుని రావాలి ' అని చెప్పింది అవ్వ.

మరుసటి రోజు అతనికి ఒక గాడిద దొరికింది. అవ్వ చెప్పిన సంగతిని గుర్తుంచుకొని, వాడు దాన్ని

ఎత్తుకోబోయాడు. ఉండబట్టలేక, అది వాడిని టపాటపామని తన్నుతున్నది. దాన్ని గమనిస్తూ ఉన్నది, ప్రక్కనే కోటలో ఉన్న రాణి. ఎంతో కాలంగా నవ్వు అంటూ ఎరగని ఆమె, దాన్ని చూసి పగలబడి నవ్వింది.

అప్పటికే 'నా భార్యను నవ్వించిన వాళ్ళకు పెద్ద బహుమానం ఇస్తాను' అని ప్రకటించి ఉన్నాడు రాజు. ఇప్పుడు రాణి ఇలా పగలబడి నవ్వటాన్ని చూసిన రాజుకు చాలా సంతోషం వేసింది.

"ఎంత అద్భుతం! ఎప్పుడూ నవ్వని నా రాణి నవ్వింది! ఎవ్వరి వల్ల, ఇది సాధ్యమయింది?' అనుకొని, అలా నవ్వించిన వాళ్లెవ్వరో వెతికి, గౌరవంగా పిలుచుకు రమ్మని పంపించాడు భటుల్ని. భటులు వెంగళప్పను రాజు దగ్గరకు తీసుకెళ్లారు. రాజు వెంగళప్పను ఘనంగా సత్కరించి, చాలా బంగారం, డబ్బులూ బహుమానంగా ఇచ్చాడు.

అంతేకాక అతనికి ఆస్థాన విదూషకుడి ఉద్యోగం కూడా ఇచ్చాడు. అలా ధనవంతుడైన వెంగళప్ప , అందరినీ నవ్విస్తూ చాలా పేరు తెచ్చుకున్నాడు.

జోకు

కనుగొంటినీ!

టీచరుగారు: రవీ! ఉత్తర అమెరికా ఎక్కడ ఉన్నదో చూపించు, మ్యాపులో?

రవి: (వెళ్ళి చూపిస్తూ) ఇదిగో, ఇక్కడుంది టీచర్!

టీచరుగారు: కరెక్టుగా చెప్పావు. పిల్లలూ, మరి అమెరికాను ఎవరు కనుక్కున్నారో తెలుసా, మీకు?

పిల్లలు: తెలుసు టీచర్!

టీచరుగారు: ఎవరు?

పిల్లలు: రవి కనుక్కున్నాడు టీచర్!



తెలివి కథ

రచన: నారాయణ, కొత్తపల్లి బృందం.

రంగాపురంలో ఉన్న రవికి ఏడేళ్ళు. 'చాలా చురుకైన పిల్లాడు ' అని వాడికి పేరుండేది. అందరూ అట్లా మెచ్చుకునీ మెచ్చుకునీ వాడికి "తను చాలా చురుకైన వాడు- అందరికంటే తెలివైనవాడు" అనిపించటం మొదలెట్టింది.. దానితో బాటు "ఇతరులంతా తెలివితక్కువ వాళ్ళు" అని వాడికి ఒక నమ్మకం ఏర్పడింది కుడాను. ఆపైన వాడు ఇతతరులందరితోటి అమర్యాదగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు.

వాళ్ళ అవ్వ అనేక రకాలుగా చెప్పి చూసింది - "ఇది మంచిపని కాదురా రవీ! ఇలా అందరినీ చిన్న చేసి చూడటం ఏమీ బాగా లేదు నాయనా" అని అవ్వ చెబితే, "నువ్వెవ్వరు? నాకు చెబుతున్నావా? అంత తెలివి ఉందా నీకు?!" అని దబాయించాడు తప్పిస్తే, వాడు తన వైఖరిని వెంట్రుకవాసంతయినా మార్చుకోలేదు.

ఒకసారి రవి బడినుండి ఇంటికి వస్తూంటే రోడ్డు మీది దుకాణంలో ఒక వింత జరిగింది. పొడుగాటి జుట్టుతో, చొక్కా లేకుండా ఉన్న బక్క పలచటి ముసలాయన ఒకడు రవిని ఆపి "టైం ఎంతయిందినాయనా?" అని అడిగాడు.

రవికి చాలా కోపం వచ్చింది. "నా దగ్గర వాచ్ ఎలాగూ లేదు. మరి వీడు నన్నెందుకు అడుగుతున్నాడు?" అని పోట్లాటకు దిగాడు: "నీకేమైనాతెలివి ఉన్నదా, అసలు? టైము అడగాలంటే వాచీ పెట్టుకున్న వాళ్లను అడుగు" అంటూ.

"తప్పైపోయింది నాయనా. 'నువ్వు బడి నుండి ఇంటికి పోతున్నావు కదా, నీకు టైము తెలిసి ఉంటుందేమో' అని అడిగాను అంతే. మీ బడి వదిలే టైము నీకే తెలీదని, నాకేం తెలుసు?" అన్నాడా ముసలాయన నవ్వుతూ.

"ఆలోచన లేకపోతే వేరే వాళ్లని చూసి నేర్చుకోవాలి. తెలివి కొనుక్కుంటే రాదు. పెంచుకోవాలి ప్రయత్నించి" అన్నాడు రవి, ఏ మాత్రం తగ్గకుండా.

దుకాణంలో శెట్టి "పోనివ్వండి స్వామీ, అతి తెలివి పిల్లాడు- వాడితో మీకెందుకు?" అన్నాడు ముసలాయనతో.

ముసలాయన నవ్వటం ఆపాడు- "లేదు శెట్టిగారూ, ఈ రవి చాలా తెలివైన పిల్లవాడు. అలాంటి పిల్లలు ఇట్లా అయిపోతే రేప్పొద్దున వాళ్లకీ మంచిది కాదు, మనకూ మంచిది కాదు. అందుకే చెప్తున్నాను- రవీ, జాగ్రత్తగా విను. ఇతరుల గురించి నువ్వు ఎలా అనుకుంటావో నువ్వూ అలాగే అవుతావు. రోజూ పది గంటల నుండి పదకొండు గంటల వరకూ నీకు పరీక్షా సమయం. రోజంతా ఇతరుల గురించి నువ్వు ఏమనుకుంటున్నావో పది తర్వాత ఒక గంటపాటు నువ్వే అట్లా అయిపోతావు. ఇట్లా ఒక నెలరోజులు గడువు. ఆ తర్వాత మళ్లీ కలుస్తాను" అన్నాడు కఠినంగా.

"నేనెట్లా ఉంటాననేది నా యిష్టం- నీదేం లేదు" అంటూ ముందుకు నడిచాడు రవి.

మరునాడు పదిగంటలకు- రవి బడిలో ఉన్నాడు. టీచర్ పాఠం చెబుతున్నారు. అకస్మాత్తుగా ఏమైందో ఏమో, రవికి పాఠం అర్థం అవ్వటం మానేసింది. టీచర్ ఏదో ప్రశ్న వేస్తే

దానికి రవి ఇంకేదో ఏదో గొణిగాడు జవాబుగా. "తెలివి కొనుక్కుంటే రాదు. కొనుక్కుంటే రాదు" అనిపించసాగింది వాడికి, ఎడతెగకుండా. ఆ ఆలోచనలో వాడికి తనేం చేస్తున్నాడో కూడా తెలియలేదు. పదకొండు గంటలకు రవి ఈ లోకంలోకి వచ్చేసరికి, తోటివాళ్లు అందరూ వాడికేసే చూస్తున్నారు నవ్వుముఖాలతోటి!

రవికి చాలా కోపం వచ్చింది వాళ్లందరి మీదా. "మీకేమీ పనులు లేవా? పనులు లేకపోతే పనులు వెతుక్కోండి. ఇక్కడేమైనా కోతులు ఆడుతున్నాయా? అని వాడు అరిస్తే అందరూ వెటకారంగా నవ్వుతూ పోయారు.

మర్నాడు 10 గంటలకు రవికి ఏమీ పనిలేనట్లు బద్దకంగా అనిపించింది. టీచర్ పాఠం చెబుతూనే ఉన్నారు- కానీ రవికి మాత్రం ఏమీ అర్థం కావట్లేదు. తెలివి వచ్చిన తర్వాత, 11 గంటలకు, చూస్తే వాడు హెడ్మాస్టరుగారి ముందు నిలబడి ఉన్నాడు. "చూడు రవీ, ఇట్లా కుదరదు" అంటున్నాడాయన! రవికి తల తీసేసినట్లైంది. వాడు మర్యాదగా "సరే సర్" అని బయటపడ్డాడు!

ఇట్లా ఒక వారం గడిచేసరికి రవికి దు:ఖం ఆగలేదు. చివరికి, ఏం జరుగుతున్నదో వాళ్ల అవ్వకు చెప్పుకోక తప్పలేదు వాడికి. వాళ్ల అవ్వ వాడిని బుజ్జగించి, "రవీ! చూడు, ఆ ముసలాయన ఎవరో ఋషి అయి ఉంటాడు. అయినా మనకి ఏమీ నష్టం కలగకుండా ఉండేందుకు ఒక ఉపాయం తట్టింది నాకు. మిగిలిన ఈ మూడు వారాలపాటూ నువ్వు ఎవ్వరినీ చిన్నచూపు చూడకు- ఆలోచనల్లోనైనా సరే, 'అందరూ నీ కంటే గొప్పవాళ్లూ, నీకంటే పెద్దవాళ్లూ, గౌరవనీయులు' అనుకుంటూ గడుపు. అప్పుడు, 10-11 గంటల మధ్య నీకు ఏ కష్టమూ రాదు- సరికదా, నువ్వే ఆ సమయంలో అందరికంటే గొప్పవాడివీ, మంచి వాడివీ అవుతావు. ప్రయత్నించి చూడు" అన్నది.

రవి అతి కష్టం మీద ఆ ఆలోచనని అమలు పరచాడు. ఒక్కోసారి వాడు ఒళ్ళు మరచిన రోజున మళ్ళీ పాత పద్ధతి తలెత్తేది. కానీ

వెంటనే వాడు బుద్ధి తెచ్చుకుని తనని తాను సరిదిద్దుకోవటం మొదలుపెట్టాడు. తప్పదు గద!

ఇట్లా రెండు వారాలు గడిచేసరికి , వాడికి ఈ పద్ధతి అలవాటు అయిపోయింది. ఇప్పుడు వాడు అందరితోటీ మర్యాదగా మాట్లాడుతున్నాడు. అంతేకాదు, అందరిని గురించీ మంచిగా అనుకుంటున్నాడు కూడా! చూస్తూండగానే నెల గడిచింది. ఋషి వచ్చి చూసేసరికి, రవి ఆయనకు నమస్కరించి చాలా గౌరవంగా మాట్లాడాడు. బడిలో పిల్లల్లూ, టీచర్లూ, చివరికి రవి వాళ్ళవ్వ కూడా రవిలో మార్పును గురించి సంతోషంగా చెప్పారు. ఆపైన రవికి పదిగంటల సమస్య ఇక ఎన్నటికి తలెత్తలేదు. వాడు అందరినీ గౌరవిస్తూ, అందరిచేతా 'తెలివైన మంచి పిల్లవాడు' అనిప్రశంసలందాడు.

ఇంద్రధనసు పిట్టలు

కథ రాయమని, జూన్ నెల కొత్తపల్లి పత్రికలో ఒక బొమ్మ ఇచ్చాం- గుర్తుందా? మీరూ ప్రయత్నించే ఉంటారు- లలితగారు, వాళ్ళ పిల్లలూ కలిసి తయారు చేసిన కథ, ఇదిగో- ఇక్కడ చదవండి.

రచన: లలిత, telugu4kids.com

అనగా అనగా ఒక పల్లెటూరు. అక్కడ ఓ చిన్న పాప. ఆ పాప పేరు లీల. లీలకు పక్షులంటే చాలా ఇష్టం. తోటలో తిరుగుతూ, పక్షుల్ని చూస్తూ, వాటి శబ్దాల్ని అనుకరిస్తూ ఎంత సేపైనా గడిపేసేది. ఒక రోజున ఆ తోటలోకి మూడు వింత పక్షులు వచ్చాయి. ఇంద్రధనసులోని రంగులన్నీ వాటిలో ఉన్నాయి! చాలా వింతగా అనిపించినై, ఆ పక్షులు! వాటిని చూసి, లీల చాలా ముచ్చట పడింది. అవి వాలి ఉన్న పొద దగ్గరకు వెళ్ళింది, నెమ్మదిగా.

ఆశ్చర్యం! అవి మనుషుల భాషలో మాట్లాడుకుంటున్నాయి! నిజానికి అవి దేవ కన్యలట. వాటికి ఇంద్రధనసు అంటే ఎంతో ఇష్టమట. అందుకని, ఒక రోజు వాన లేకున్నా,

అవి తమ మాయతో ఆకాశంలో ఇంద్రధనసును సృష్టించి, జారుడు బల్లలాగా దాని మీద ఎక్కి, జారుతూ ఆడుకోసాగాయిుట. దాంతో వాన దేవుడికి కోపం వచ్చి "మీకు ఇష్టమైన ఇంద్రధనసు పిట్టలుగా మారిపోండి" అని, పిట్టలుగా మార్చేసి భూలోకానికి పంపించేశాడుట. ఆ విషయాన్ని గుర్తు చేసుకుని పక్షుల రూపంలో ఉన్న దేవకన్యలు బాధపడుతున్నారు. ఇది విని లీలకు వాటి పైన చాలా జాలి వేసింది.

అ తర్వాత పిట్టలు ఇంకేమీ మాట్లాడలేదు. కాసేపు అలాగే ఎదురు చూసిన లీల, ఇంక ఆగలేక, మెల్లగా పిట్టలను పిలిచింది. వెంటనే అవి మామూలు పిట్టలలానే కూస్తూ అక్కడి నించి ఎగిరి పోబోయాయి. కానీ, లీల "నేను అంతా విన్నాను. మీకు ఏమైనా సాయం చెయ్యగలనా?" అని అడిగేసరికి, "అలా ఇంకొకరి మాటలు వినడం తప్పు కాదా?" అని అడిగాయవి.

లీల అన్నది- "మీరు మనుషులలాగా మాట్లాడుతుంటే కుతూహలం కొద్దీ విన్నాను. మీరు కష్టంలో ఉన్నారని తెలిసి, 'సాయం చెయ్యగలనేమో' అని అడుగుతున్నాను" అంది. అప్పుడా పిట్టలు కాసేపు ఒక దానిని ఒకటి చూసుకుని, "సరే చెప్తాము. చెయ్యగలవేమో చూడు," అన్నాయి.

ఆ పిట్టలు చెప్పిన దాని ప్రకారం, జరగ వలసినది ఇదీ: రోజూ సాయంత్రం పిట్టలు చెప్పిన సమయానికి తోటకు వచ్చి, అవి నేర్పే పాటను నేర్చుకోవాలి లీల. పాటను పూర్తిగా నేర్చుకునేందుకు నెలరోజులు పడుతుంది. అయితే ఆ పాటను ఇంకెవ్వరి ముందూ పాడకూడదు. నెల పూర్తయినాక లీల పాటను వినిపించగానే, పిట్టలు మళ్లీ దేవకన్యలుగా మారిపోతాయి. అయితే ఆ తర్వాత ఇంకెప్పుడూ లీల ఆ పాటను పాడకూడదు. పాడిందంటే వాళ్లు మళ్ళీ పిట్టలుగా మారిపోవాల్సి వస్తుంది!

లీల అలా చెయ్యడానికి ఒప్పుకుంది. పిట్టలు నేర్పిన ఆ పాట ఎంతో బావుంది. ఇంట్లో ఆ పాటను పైకి పాడకుండా ఉండటం కష్టంగానే ఉంది. మొత్తానికి నెల గడిచింది. లీల పాటను

పూర్తిగా నేర్చుకుంది. ఇక తను పాట పాడి, పిట్టలకు మళ్ళీ దేవకన్యల రూపం తెప్పించటమే మిగిలి ఉంది.

ఆ రోజున లీల చాలా ఉత్సాహంగా వెళ్ళింది తోటకు. కానీ ఎందుకనో, ఆ రోజున పిట్టలు రాలేదు! లీల అక్కడే కూర్చొని చాలా సేపు ఎదురు చూసింది. చివరికి బాధగా ఇంటికి వెళ్ళింది.

అలా వరసగా కొన్ని రోజులపాటు లీల రోజూ తోటకు వచ్చి, పిట్టల కోసం వెతికేది. తను నేర్చుకున్న పాటను మర్చిపోకుండా ఉండాలని, ప్రతిరోజూ ఒంటరిగా పాడుకునేది.

ఒకరోజున వాళ్ళ ఊళ్ళో జాతర జరిగింది. లీల కూడా వెళ్ళింది, జాతర చూసేందుకు. అక్కడ ఒక చోట చాలామంది జనాలు పోగయి ఉన్నారు. లీల కుతూహలం కొద్దీ అక్కడకి వెళ్ళి చూసేసరికి, ఒక పెద్ద పంజరంలో కనిపించాయి ఆ మూడూ పిట్టలూ! పిట్టలని పట్టుకున్న వాడు వాటి చేత మాట్లాడిస్తూ, ప్రదర్శిస్తున్నాడు. జనాలందరూ ఆ వింతను చూసి ఆనందిస్తున్నారు!

లీలకు చాలా బాధ వేసింది. వెంటనే పిట్టలు తనకి నేర్పించిన పాటను గొంతెత్తి పాడడం మొదలు పెట్టింది. అక్కడ ఉన్న వాళ్ళందరూ అద్భుతమైన ఆ పాటను విని మైమరచిపోయారు. పాట అయిపోయే సరికి పంజరంలో ఉన్న పిట్టలు కాస్తా మాయమయ్యాయి. పాటను విన్నవాళ్లు కొట్టే చప్పట్లలో పిట్టలవాడి అరుపులు ఎవ్వరికీ వినిపించలేదు. సందడి తగ్గే సరికి అందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు!

అయితే ఇప్పుడు లీలకి ఇంకొక చిక్కొచ్చి పడింది. ఇంటికి వెళ్ళాక, అందరూ లీలను ఆ పాటే పాడమని బలవంతం చేయసాగారు.

వాళ్ళకు లొంగి, చివరికి లీల ఒక్క సారి ఆ పాటను పాడేసరికి, దేవకన్యలు మళ్ళీ పిట్టలుగా మారి, లీల ఉన్న చోటికి వచ్చేసాయి!

లీల వాటిని చూసి చాలా సిగ్గుపడింది. అయితే అవి నవ్వి, " ఏమీ నష్టం జరగలేదులే! మేము వెళ్ళాక వాన దేవుడికి జరిగిందంతా చెప్పాము. అందరి ముందూ పాట పాడవలసి వచ్చినందుకు ఇక లీల మళ్ళీ పాడకుండా ఉండడం కష్టమనీ, అందువల్ల ఆ పాటను లీల ఎప్పుడైనా ఎక్కడైనా పాడుకునేలా ఒప్పుకోమనీ వాన దేవుడిని ప్రాధేయ పడ్డాము. వాన దేవుడు ఒప్పుకుని, ఆ విషయం చెప్పి రమ్మని మమ్మల్ని మళ్ళీ ఇలా పంపించాడు" అని చెప్పాయి!

ఆ సంగతి తెలుసుకొని లీల ఎంతో సంతోషించింది. ఇక తనకు ఎప్పుడు తోస్తే అప్పుడు అద్భుతమైన ఆ పాటను మనసారా పాడుకుంటూ ఉండచ్చు!

అయితే ఎవ్వరికీ తెలీని రహస్యం ఒకటుంది: ఎప్పుడైనా, తోటలో ఒంటరిగా ఉన్నప్పుడు- లీల గనక ఆ పాట పాడితే, ఇంద్రధనసు పిట్టలు వచ్చి, లీలను అలా ఆకాశంలోకి తీసుకుని వెళ్ళి, మబ్బులలో తిప్పి తీసుకు వస్తాయి!

ఎంత కష్టం! జోకు

టీచరుగారు: 1+1=2 అవునా?

పిల్లలు: అవును.

టీచరు గారు: 2+2=4 అవునా?

పిల్లలు: అవును.

టీచరుగారు: మరి 4+4 ఎంత?

పిల్లలు: పోండి టీచర్! మీరేమో సులభంవి చెప్పి, మమ్మల్ని కష్టంవి అడుగుతారు!

నీకు రెండు- నాకు మూడు

రచన: కె.గంగమ్మ, ఉపాధ్యాయురాలు, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.

ముసలయ్య, ముసలమ్మ చాలా పేదవాళ్లు. అంతేకాదు- పరమ పిసినారులు కూడా! ఒకరి పొందు ఒకరు మెచ్చరు! " ఒకరు కట్టె ఏది? అంటే మరొకరు తెడ్డు ఏది?" అంటారు.

ఒకరోజు ముసలయ్య కష్టపడి నాలుగు రూపాయలు సంపాదించాడు. దానితో అరశేరు జొన్న పిండి తీసుకుని వచ్చి, ముసలమ్మకిచ్చి, రొట్టెలు చేయమన్నాడు. మరునాడు ఉదయాన్నే ముసలమ్మ రొట్టెలు కాల్చింది- సరిగ్గా ఐదు రొట్టెలు తయారయ్యాయి.

రొట్టెలు తయారవ్వగానే ఇద్దరూ తినేందుకు కూర్చున్నారు. ముసలయ్య పళ్ళెంలో రెండు రొట్టెలు వేసి, తన పళ్ళెంలో మూడు రొట్టెలు వేసుకుంది ముసలమ్మ. ఇది చూడగానే ముసలయ్యకు పిచ్చి కోపం వచ్చింది: "ఏమే!

కష్టపడి సంపాదించింది నేను- మరి నాకు తక్కువ; ఊరికే కూర్చునే నీకు ఎక్కువనా?" అని చిందులేశాడు. ముసలమ్మ కూడా ఏమీ తగ్గలేదు- "నేను కష్టం చేసి రొట్టెను కాల్చాను- కాబట్టి నాకు మూడు; నీకు రెండు- ఇదే న్యాయం!" అంది.

ఇద్దరూ చాలా సేపు వాదించుకున్నారు. చివరికి- "సరే, ఇద్దరం ఒక పందెం వేసుకుందాం- మన ఇంట్లో రెండు నులక మంచాలు ఉన్నాయి కదా! వాటి నిండా నల్లులే. వాటి మీద కదలకుండా పడుకోవాలి ఇద్దరమూ. ముందుగా ఎవరు కదిలితే వాళ్లు ఓడిపోయినట్లు! ఓడినవాళ్లకు రెండు; గెలిచిన వాళ్లకు మూడు- సరేనా? " అని పందెం వేసుకున్నారు.

పందెం ప్రారంభం అయింది. ఇద్దరూ మంచాలమీద బిర్ర బిగుసుకొని పడుకున్నారు. మధ్యాహ్నం అయింది- ఎవ్వరూ కదల లేదు. సాయంత్రం అయింది- అయినా కదలేదు! పట్టిన పట్టు వదల లేదు ఇద్దరూ. నల్లులు బాగా కుట్టి పండగ చేసుకుంటున్నాయి. ఒళ్ళంతా దద్దుర్లు లేచాయి. అయినా ఏ ఒక్కరూ కదలలేదు; మెదల లేదు! 'కదిలితే రొట్టె పోతుంది' అనే ఆలోచన! ఇద్దరూ అలాగే శవాల మాదిరి పడుకుండి పోయారు. రాత్రి అయింది- మళ్లీ తెల్లవారింది- అయినా ఇద్దరిలో ఏ ఒక్కరూ కదలలేదు.

'ఇంటి తలుపులు తెరుచుకోలేదు- మధ్యాహ్నం అయింది- ఇంట్లో ఎలాంటి అలికిడీ లేదు- అని పొరుగిళ్ళ వాళ్ళకి అనుమానం వచ్చింది. అందరూ కలిసి, తలుపులు త్రోసి, లోపలికిపోయి చూస్తే ఏముంది- ఇద్దరు ముసలోళ్లూ శవాల మాదిరి పడివున్నారు, మంచాలమీద. రెండు శరీరాలూ ఎర్రగా కందిపోయి ఉన్నాయి. ఉలుకు లేదు-పలుకు లేదు. అందరూ గుమిగూడారు. 'పాపం! చనిపోయారు' అని ఏడిచారు. అయినా వీళ్లిద్దరూ విన్నారు తప్పిస్తే- కదల లేదు! 'కదిలితే రొట్టెలు పోతాయి' అని ఊరుకున్నారు.

'శవాలని అలా వదిలేస్తే ఎలా?' అని, వీళ్ళను మంచాలతో సహా దహనం చేద్దామనుకున్నారు పొరుగు వాళ్ళు. రెండు మంచాలనూ

'ఎత్తండంటే ఎత్తండి' అని, అందరూ కలిసి ఎత్తుకొని, స్మశానానికి బయలు దేరారు. రెండు చితులు పేర్చి, ఇద్దరినీ చితులమీద పడుకోబెట్టారు. అయినా ముసలమ్మగాని, ముసలయ్యగాని కదలనే లేదు- కదిలితే రొట్టె పోతుందని!

సరే, అందరూ కలిసి చితికి నిప్పంటించారు; ఎవరికి వాళ్లు వెళ్ళిపోయారు. ఇంకొక్క ఐదుగురు మాత్రం ఉన్నారు అక్కడ. ఆలోగా చితుల మీద పడుకున్న ఇద్దరికీ వేడి తగలసాగింది. అయినా భరిస్తున్నారు తప్ప ఏ ఒక్కరూ కదలలేదు! చివరికి వేడి శరీరాలకి అంటుకోసాగింది! ఇంక ఓర్చుకోవడం ముసలయ్యవల్ల కాలేదు- గట్టిగా మొత్తుకుంటూ, ఒక్క ఉదుటున చితి నుండి బయటికి దూకాడు! మరుక్షణంలోనే ముసలమ్మ "నువ్వే ఓడావు- నీకు రెండు; నాకు మూడు" అని అరుస్తూ తను కూడా చితి నుండి బయటికి దూకింది!

ఇంకేముంది? 'పిచ్చాపాటిలో మునిగిఉన్న ఐదుగురూ "పరుగెత్తండి రోయ్! ఇవి అప్పుడే దయ్యాలయ్యాయి! మనల్ని పంచుకోవడానికి వాదులాడుకుంటున్నాయి!" అని కాలి బిర్రున పరుగెత్తారు.

ఇది చూసిన ముసలయ్య, ముసలమ్మ తమ ప్రవర్తనకు తామే సిగ్గుపడ్డారు. ఇక ఆ ఊరు లోకి పోవడానికి వాళ్లకు మొహం చెల్లలేదు. అందుకని వాళ్ళు బుద్ధిగా వేరే ఊరికి పోయి బ్రతుక్కున్నారు!

హోం-వర్కు

కవిత

మూలం: శ్యాంప్రసాద్ నమ్మి

తెలుగు అనువాదం: కె.సురేష్, మంచి పుస్తకం.

(ఫొటో: 'దిహిందూ' 07-07-2010,"A child at work!" బడి లంచ్ సమయంలో గొర్రెలు కాస్తున్న ఓ పాప)

ఒక పిల్ల బడికి పోదు- మేకలను కాస్తుంది.

కట్టె పుల్లలను ఏరుకుని ఇంటికి తెస్తుంది.

అన్నం వండటంలో అమ్మకు సాయపడుతుంది.

****

ఒక పిల్ల పుస్తకాల బరువును మోస్తూ బడికి వెళ్తుంది-

సాయంత్రానికి అలసి సొలసి ఇంటికి వస్తుంది.

బడిలో ఇచ్చిన హోం వర్కుని , ఆమె అమ్మానాన్నలతో చేయిస్తుంది.

****

భారం పుస్తకాలదైనా, కట్టెపుల్లలదైనా-

ఇద్దరు పిల్లలూ మోస్తున్నారు.

****

కానీ కట్టె పుల్లలతో పొయ్యి మండుతుంది;

అప్పుడు కడుపు నిండుతుంది!

అంతేకాదు, కట్టెపుల్లలు తెచ్చే పిల్లకి ఈ విషయం తెలుసు!

కట్టెపుల్లల ఉపయోగాన్ని ఆమె గుర్తిస్తుంది.

మరి పుస్తకాలలోని విషయాలు ఎప్పుడు,

ఎలా ఉపయోగపడతాయో తెలీకుండానే,

బడికి వెళ్ళే పిల్ల వాటిని బట్టీ పడుతుంది.

****

పుల్లల్ని ఏరటం, మేకల్ని మేపటం,

అమ్మతో కలిసి అన్నం వండటం:

నిజానికి ఇవన్నీ ఇంటి పనులు-

కానీ వీటిని 'హోం-వర్కు' అనరు.

బడిలో ఇచ్చిన అభ్యాసాలు

ఇంటిపని కాకపోయినా,

వాటిని 'హోం-వర్కు' అంటారు.

****

చదువులు నిజంగా ఇంటిపనితో ముడిపడి-

పుల్లలు ఏరే పిల్లలు కూడా-

ఇలాంటి పుస్తకాలు చదివే రోజు ఎప్పుడు వస్తుందో!



ఆవు-పంది

సేకరణ: ఉప్పలపాటి మాచిరాజు, లోక్‌సత్తా, జనబలం.

తెలుగు అనుసరణ: నారాయణ, కొత్తపల్లి బృందం.

ఒక ఊళ్లో ధనయ్య అనే షావుకారు ఉండేవాడు. అతని దగ్గర లేని సంపద అంటూ లేదు. అయితే అతను పరమ పిసినారి. ఎడమ చేత్తో కాకిని విదిలించేవాడు కాదు. ఊళ్లో వాళ్ళంతా అతన్ని చాలా అసహ్యించుకునేవాళ్ళు.

ఒక రోజున ధనయ్య వాళ్లతో అన్నాడు "చూడండి, మీరు నన్ను చూసి అసూయ

పడుతున్నారల్లే ఉంది- లేకపోతే నేను సంపదను ఎంతగా ప్రేమిస్తున్నానో మీకు అర్థం కాలేదేమో- నిజం ఆ దేవునికే తెలుసు. అయితే మీరంతా నన్ను ద్వేషిస్తున్నారు- అంతవరకూ నాకు తెలుస్తూనే ఉన్నది. చెప్పేది వినండి- నేను చచ్చిపోయినప్పుడు ఒక్క పైసాకూడా వెంట తీసుకుపోను. నా సంపద మొత్తాన్నీ ఇతరులకే ఇచ్చేసి పోతాను. నన్ను అర్థం చేసుకోండి"అని.

అయినప్పటికీ జనాలు అతన్ని ద్వేషించటం మానలేదు. అతని ప్రసక్తి వచ్చినప్పుడల్లా వాళ్లు ఎగతాళిగా నవ్వేవాళ్ళు. "మీకేమైంది? నేను చచ్చిపోయాక నా సంపదనంతా మీకే ఇచ్చేస్తానని చెబుతున్నాకూడా నన్ను అలా చిన్న చూపు చూస్తారెందుకు?" అని ధనయ్య ఎంత వాపోయినా జనాలెవరూ అతన్ని నమ్మేవాళ్ళు కాదు.

"నేనేమైనా దేవుడినా? అందరిలాగే నేను కూడా ఎప్పుడో ఒకప్పుడు పోయేవాడినే. అప్పుడు నా డబ్బంతా నిజంగానే దాన ధర్మాలకు వినియోగింపబడుతుంది. అప్పటివరకూనే గదా, నేను దీన్ని ఎవ్వరికీ ఇవ్వనిది?" అనేవాడు ధనయ్య.

ఒకరోజు సాయంత్రం దుకాణం కట్టేశాక, అతను నడుచుకొని పోతుంటే, గబుక్కున వాన మొదలైంది. ధనయ్య పరుగెత్తి, దగ్గర్లో ఉన్న ఒక చెట్టు క్రింద తలదాచుకున్నాడు. ఆ చెట్టు క్రిందే ఒక ఆవు, ఒక పంది నిలబడి ఉన్నై. అవి ఏదో మాట్లాడుకుంటున్నట్లనిపిస్తే, ధనయ్య వాటి మాటలు వింటూ నిల్చున్నాడు:

పంది అంటోంది, ఆవుతో-"అందరూ నిన్ను మెచ్చుకుంటారు; నన్నెవరూ మెచ్చుకోరు, ఎందుకు? నేను చచ్చిపోయాక నా మాంసం, క్రొవ్వు, నరాలు- చివరికి నా తోలు-వెంట్రుకలు కూడా జనాలకు ఉపయోగపడతాయి. ఇట్లా నా వల్ల అన్నన్ని ఉపయోగాలుంటాయి. మరి, నువ్వు ఇచ్చేది ఒక్క పాలు మాత్రమే- అయినా జనాలు నిన్నెప్పుడూ పొగుడుతుంటారు, నన్నేమో ద్వేషిస్తారు- ఎందుకిలాగ?" అని.

ఆవు దానితో అన్నది- "చూడు, చనిపోయాక నా శరీరం కూడా జనాలకు ఎంతో కొంత ఉపయోగ పడుతుంది. కానీ నేను బ్రతికుండగానే వాళ్లకు పాలను ఇస్తుంటాను.

నా దగ్గర ఉన్నదాన్ని పది మంది తోటీ పంచుకోవటం నా నైజం. ఆ గుణాన్ని అందరూ గుర్తిస్తారు. కానీ, నువ్వు బ్రతికి ఉన్నప్పుడు ఎవ్వరికీ ఏమీ ఇవ్వవు- నువ్వు చచ్చిపోతే తప్ప, ఎవరికీ నీతో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. జనాలు ఎప్పుడూ చూసేది ప్రస్తుతాన్నే. 'ప్రస్తుతం మనం ఎలాంటివాళ్ళం' అన్నదే ముఖ్యం. నువ్వు బ్రతికుండగా చేసే మేలే నీకు అక్కరకు వస్తుంది" అని.

ధనయ్యకు కనువిప్పైంది. ఆ నాటినుండే అతని నైజం మారిపోయింది. అతని పిసినారితనం దూరమైనందుకు ఊళ్లో జనాలు ఎంతో సంతోషించారు. క్రమంగా ధనయ్యకు 'మంచి మనిషి' అని పేరు వచ్చింది!

జోకులు

ఒంట్లోనా, బళ్ళోనా?

కొడుకు: నేను ఇవాళ్ళ బడికి వెళ్ళను.

తండ్రి: ఏం, ఎందుకు?

కొడుకు: నాకివాళ్ళ బాగాలేదు.

తండ్రి: ఏమైంది? ఎక్కడ బాగాలేదు?

కొడుకు: బళ్ళో.

తండ్రి: ఆ!!

చురుక్కు!

టీచరుగారు: పిల్లలూ నేను అడిగే ప్రశ్నలన్నిటికీ మీరు చటుక్కుమని జవాబు చెప్పాలి, సరేనా?

పిల్లలు: సరే టీచర్!

టీచర్: రాముా! రెండు రెండ్లెంత?

రాము: చటుక్కు టీచర్!



చేప నవ్వు

పెద్ద కథ

కాశ్మీరీ జానపద కథ

మూల కథనం: A.K.రామానుజన్, ఫోక్ టేల్స్ ఫ్రం ఇండియా

తెలుగు అనుసరణ: నారాయణ



తలమీద చేపల తట్ట పెట్టుకొని, ఒకామె చేపలమ్ముకుంటూ పోతున్నది- రాజు గారి కోట పక్కనుండే. అంత:పురానికి చాలా కిటికీలున్నై. ఒక కిటికీలోంచి తల బయటికి పెట్టి చూస్తున్నారు, రాణి గారు. చేపలమ్మే మనిషిని దగ్గరికి రమ్మని సైగ చేసారు. ఆమె కిటికీ దగ్గరికి వచ్చి, తట్టను దింపుకుంటున్నది- సరిగ్గా అదే సమయానికి, తట్టలో అడుగున ఉన్న ఒక పెద్ద చేప కదిలి, పైకి ఎగిరి, మళ్ళీ తట్టలో పడింది.

'అది మగదా, ఆడదా?" అడిగారు రాణీగారు -"ఇది రాణివాసం కదా, ఇక్కడ ఉండేవాళ్ళంతా ఆడవాళ్ళే. అందుకని నేను ఆడ చేపను ఒక దాన్ని కొందామనుకుంటున్నాను".

రాణిగారి మాటలు వినగానే ఆ చేప గట్టిగా నవ్వింది.

"ఇది మగది" అని చెప్పి, చేపలామె తట్టను తిరిగి తలమీద పెట్టుకొని, వెళ్ళిపోయింది.

రాణీగారు కోపంగా వెనుదిరిగారు- ఒక మామూలు చే ప , తనను చూసి ఎందుకు నవ్వాలి?" అని ఆమెకు ఉక్రోషం కలిగింది. సాయంత్రం అయినా ఆమె కోపం చల్లారలేదు.

సాయంత్రం రాణి వాసానికి వచ్చిన రాజుగారికి, అంత:పురం అంతా బోసిగా కనబడ్డది. "ఏంటి సంగతి, ఏమైంది? నీ ఆరోగ్యం బాగా లేదా?" అడిగారు ఆయన.

"నా ఆరోగ్యానికేం, నిక్షేపంగాఉన్నది. కానీ ఒక చేప వింత ప్రవర్తన వల్ల, నాకు తట్టుకోలేని కోపం వచ్చింది. ఇవాళ్ళ ప్రొద్దున ఒకామె నాకు చేపలు అమ్మ జూపింది- అయితే నేను 'అది ఆడచేపనా, మగచేపనా?' అని అడిగేసరికి, అది నన్ను చూసి వెకిలిగా నవ్వింది!"

"నిజమా! చేప మిమ్మల్ని చూసి నవ్విందా? మీరేమీ భ్రాంతి చెందలేదు గద?" అడిగారు రాజుగారు, ఏమనాలో తోచక.

"నాకు ఆమాత్రం తెలివి, జ్ఞా నం ఉన్నాయిలెండి. నేను నా యీ సొంత కళ్ళు పెట్టుకొని చూశాను దాన్ని! నా యీ సొంత చెవులతో విన్నాను- దాని వెకిలి నవ్వును!"

"చాలా ఆశ్చర్యం! సరే కానివ్వండి, నేను ఈ అంశంపైన విచారణ జరిపిస్తాను " అన్నారు రాజుగారు.

మరునాడు తెల్లవారగానే ఆయన మంత్రిని పిలిపించారు. ఆయనకు సంగతినంతా వివరించారు. చేప అలా 'అమర్యాదగా ఎందుకు నవ్వింది?' అన్న అంశం మీద విచారణ చేపట్టమన్నారు. ఆరు నెలలలోగా ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం తేలేకపోతే మరణదండన తప్పదని భయపెట్టారు.

ఆ లోగానే వాస్తవాన్ని బయట పెడతానని నమ్మబలికి, మంత్రి అక్కడి నుండి తప్పుకున్నాడు. కానీ పనిని ఎక్కడి నుండి మొదలు పెట్టాలో ఆయనకు ఏమాత్రం అర్థం కాలేదు. చేపలమ్మకూ ఏమీ తెలియలేదు, మరి!

తర్వాత ఐదు నెలల పాటు మంత్రి నిరంతరం

అదే ధ్యాసలో గడిపాడు-"చేప ఎందుకు నవ్వింది?" అని. దానికి కారణం కనుగొనేందుకు ఆయన వెళ్ళని చోటూ లేదు; అడగని మనిషీ లేడు- జ్ఞానుల్ని, మంత్రగాళ్ళనీ- అందర్నీ అడిగాడు మంత్రి. అయినా వాళ్ళు ఎవ్వరూ చేప నవ్వులోని అంతరార్థాన్ని వివరించలేకపోయారు.

మంత్రిగారికి గుండె పగిలినట్లయింది. తిండి , నిద్ర కరువయ్యాయి. తనకి ఇక చావు తప్పదని తేల్చుకొని, ఆయన నిరాశగా వెనుతిరిగి, తన ఇల్లు చేరుకున్నాడు. తన ఇంటి వ్య వహారాలను చక్కబరచుకున్నాడు. రాజుగారి శాసనానికి తిరుగు ఉండదని, ఆయన తన మాటపై నుండి వెనక్కి తగ్గే అవకాశం లేదని- ఆయనకు తెలుసు. 'రాజుగారికి కోపం వస్తుంది- తను మరణించటమే కాదు; తన కుటుంబం మొత్తం ఆయన కోపాగ్నికి బలవుతుంది.'

మంత్రిగారు తన కొడుకుకు విషయం అంతా చెప్పేశారు. రాజుగారి కోపం చల్లారేంత వరకు అతన్ని దేశాలు పట్టి పొమ్మన్నారు. ఆపైన క్షణాలు లెక్కపెట్టుకుంటూ ఇంట్లో కూర్చున్నారు.

మంత్రి కొడుకు కుర్రవాడు , బాగా తెలివైన వాడున్నూ. అతను బయలుదేరి, నడుచుకుంటూ తన కాళ్ళు, అదృష్టం తనని ఎటువైపు తీసుకువెళ్తే అటువైపు పోసాగాడు. కొన్ని రోజులు అలా నడిచిన తర్వాత, అతనికి ఇంకొక బాటసారి కనబడ్డాడు. అతనొక రైతు. యాత్రలు ముగించుకొని తన ఊరికి తిరిగిపోతున్నాడతను.

మంత్రి కొడుక్కి ఆ రైతు తీరు నచ్చింది. రైతు ఒప్పుకున్న మీదట,మంత్రికొడుకు అతనితో కలిసి నడవటం మొదలెట్టాడు. ఎండ మండిపోతున్నది. నడక కష్టంగా ఉన్నది. ఇద్దరూ బాగా అలసిపోయి ఉన్నారు.

"మనం ఒకళ్లనొకళ్లం ఎత్తుకొని పోగలిగితే చాలా బాగుంటుందనిపిస్తోంది నాకు. ఏమంటావు?" అన్నాడు మంత్రికొడుకు అతనితో, ఉత్సాహంగా.

"మనిషిని చూస్తే బాగున్నాడు. కానీ పాపం, పిచ్చివాడు లాగున్నాడు" అనుకున్నాడు రైతు.

కొంతసేపటికి వాళ్లొక వరిమడిని దాటుకొని పోవలసి వచ్చింది. కోతకు సిద్ధంగా ఉంది, పొలం. బంగారు రంగులో మెరుస్తున్న కంకులు చల్లగా వీచే గాలికి అటు ఇటూ ఊగుతున్నై.

"ఈ పంట అంతా తినేదేనా,కాదా?" అడిగాడు మంత్రికొడుకు.

రైతుకు ఏం చెప్పాలో అర్థం కాక, "ఏమో నాకు తెలీదు" అనేశాడు.

కొంచెసేపటికి బాటసారులిద్దరూ ఒక పెద్ద ఊళ్లోకి వచ్చారు. జేబులో పెట్టుకొనే చిన్న కత్తిని ఒకదాన్ని రైతుకు ఇచ్చాడు మంత్రి కొడుకు : "తీసుకో, మిత్రమా! దీంతో రెండు గుర్రాలను తీసుకురా. కానీ దయచేసి దీన్ని కూడా వెనక్కి తీసుకురా- ఇది చాలా విలువైనది" అన్నాడు.

రైతుకు కొంచెం కోపమూ, కొంచెం నవ్వూ ఒకేసారి వచ్చాయి. అతను కత్తిని పక్కకు పెట్టేసి, "వీడు తిక్కవాడైనా అయి వుండాలి, లేకపోతే తెలివిగా నన్ను పిచ్చోడిని చేస్తూనైనా ఉండాలి!" అని గొణుకున్నాడు. మంత్రి కొడుకు ఆ మాటలు వినికూడా విననట్లు నటించి, చాలాసేపు ఇక ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

ఆ పైన వాళ్లిద్దరూ ఒక పెద్ద పట్టణం చేరుకున్నారు. ఆ పట్టణం దాటాక కొద్ది దూరంలోనే రైతు ఉండే గ్రామం వస్తుంది. పట్టణం మొదట్లోనే వాళ్లకొక పెద్ద గుడి ఎదురైంది. దానికొక విశాలమైన అరుగు, ఆవరణ ఉన్నై. అయితే అక్కడున్న వాళ్లు ఎవ్వరూ వీళ్లను పలకరించలేదు; కనీసం ఆ చావడిలో చెట్టు నీడన కూర్చుని సేదదీరి పొమ్మని కూడా అనలేదు.

"ఎంత పెద్ద స్మశానం !" అన్నాడు మంత్రికొడుకు, ఆశ్చర్యపోతున్నట్లు.

"వీడి ఉద్దేశ్యం ఏంటి? ఇంత పెద్ద జనాభాతో, ఇంత గొప్పగా ఉన్న పట్టణాన్ని వీడు స్మశానం అంటున్నాడు?" అనుకున్నాడు రైతు.

పట్టణం దాటాక, అవతలి వైపున వాళ్లొక స్మశానాన్ని దాటిపోతున్నారు. అక్కడ కొందరు మనుషులు ఒక సమాధి ముందు నిలబడి ప్రార్థనలు చేస్తున్నారు. వాళ్లలో కొందరు మరణించిన తమ పెద్దల్ని గుర్తుచేసుకుంటూ దారిన వచ్చే-పోయే వాళ్లందరికీ రొట్టెలు పంచి

పెడుతున్నారు. వాళ్ళు ఈ బాటసారులిద్దరినీ పిలిచి, తినగలిగినన్ని రొట్టెలు ఉచితంగా ఇచ్చారు.

"ఎంత అద్భుతమైన పట్టణం కదా, ఇది!"అన్నాడు మంత్రికొడుకు, మురిసిపోతూ.

"వీడు నిజంగా పిచ్చివాడే- సందేహం లేదు" అనుకున్నాడు రైతు."ఇకపైన ఏం చేస్తాడో చూడాలి. నేలను నీళ్లంటాడేమో-నీళ్లను నేలంటాడు; బహుశ: చీకటిని వెలుగని, వెలుగుని చీకటని అంటాడేమో!"

అప్పుడు వాళ్లొక చిన్నవాగును దాటాల్సి వచ్చింది. వాగు వేగంగా ప్రవహిస్తున్నది. దాని లోతు కూడా కొంచెం ఎక్కువగానే ఉన్నది. రైతు చెప్పులు వదిలి, పంచెను పైకి ఎత్తి పట్టుకొని దాన్ని దాటాడు. కాని మంత్రికొడుకు తను వేసుకున్న చెప్పులు, పైజామా అలాగే ఉంచుకొని వాగును దాటుకున్నాడు.

"అబ్బ!నిజంగా ఇంత పిచ్చోడిని ఎక్కడా చూడలేదు!"అనుకున్నాడు రైతు తనలో తాను.

అయినా రైతుకి ఈ కుర్రవాడు నచ్చాడు.అతన్ని చూస్తే మంచి కుటుంబీకుడి లాగాను, మర్యాదస్తుడి లాగాను ఉన్నాడు.ఇలాంటి వాడి పిచ్చి మాటలు విని తన భార్య , కూతురు బాగానే సంతోష పడొచ్చు! అందుకని,అతను మంత్రి కొడుకుతో "ఎలాగూ ఇంత దూరం వచ్చావు- అలాగే పనిలో పనిగా మా ఇంటికీ వచ్చి పోరాదూ? కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్నట్లుంటుంది!" అన్నాడు మర్యాదకొద్దీ.

మంత్రి కొడుకు అతనికి ధన్యవాదాలు చెప్పి, "కానీ, మీరేమీ అనుకోకపోతే, ఓ సంగతి అడుగుతాను, చెప్పండి- మీ ఇంటి దూలమైతే గట్టిగా ఉంది గద?" అని అడిగాడు.

రైతు తన నోటికి ఏది తోస్తే అది మాట్లాడాడు.

అంతలో వాళ్ళ ఊరు వచ్చింది. మంత్రి కొడుకును ఒక తోపులో ఉండమని, తనొక్కడే ముందుగా ఇల్లు చేరుకున్నాడు రైతు. ఇంట్లో వాళ్ళతో అతను "నేనూ, ఒక కుర్రవాడూ చాలా దూరం నుండి కలిసి నడుస్తూ వచ్చాం. నేను అతన్ని మన ఇంట్లో కొద్ది రోజులు ఉండిపొమ్మన్నాను. కానీ వాడు ఎంత వెర్రివాడంటే- వాడు చేసేదీ, అనేదీ ఒక్కటీ అర్థం కాలేదు నాకు. 'మా ఇంటికి రా నాయనా' అంటే, 'మనింటి దూలం గట్టిదేనా?' అని అడిగాడు వాడు! హ హ్హాహ్హా! గొప్ప పిచ్చోడు!" అన్నాడు.

రైతు కూతురు చాలా తెలివైన పిల్ల; బాగా చురుకైనది కూడాను. ఆమె రైతుతో అన్నది-"అతనెవరో,ఏమిటో తెలీదుగాని, నువ్వన్నట్లు అతను వెర్రివాడైతే కాదు. 'తను మీ ఇంటికి వస్తే, ఆ ఖర్చును భరించే శక్తి మీకున్నదా?' అని అడిగాడు అతను: 'మీ ఇంటి వాసం గట్టిదేనా?' అంటే అర్థం అది!" అన్నదాపిల్ల.

"ఓహో! అదా!" అన్నాడు రైతు- "ఇప్పుడు అర్థమైంది. అతని పిచ్చి మాటలు కొన్నింటికి బహుశ: నువ్వు అర్థం చెప్పగలవేమో చూడు. మేమిద్దరం నడిచివస్తుంటే "మనం ఒకళ్లనొకళ్లం ఎత్తుకొని నడిస్తే ఎంత బాగుటుంది?!" అన్నాడు వాడు! అలా ప్రయాణం చాలా బాగుంటుందట."

"అవును, నిజం! మీరు కథలు చెప్పుకుంటూ నడవాలని అతని ఉద్దేశం! అలా నడిస్తేప్రయాణం తేలిక అవుతుంది కదా, అని"

"ఓహో,నిజమే. మేం ఒక వరి మడి లోంచి వస్తుంటే "ఈ పంటంతా తిన్నదా,ఇంకా ఉన్నదేనా?" అని అడిగాడు వాడు!"

"అయినా మీకు అర్థం కాలేదా,నాన్నా!? 'ఆ పొలపు యజమాని పరిస్థితి ఏంటి?'అని అడిగాడతను. యజమాని అప్పుల్లో ఉంటే, పంటంతా అప్పులవాళ్లకు పోతుంది. నిండుగా కనబడుతున్నా, నిజానికి అది తినేసిన పంట క్రిందే లెక్క. అలా కాకుండా అతనికి ఎలాంటి అప్పూ లేకపోతేనే కద, పంట నిలిచి ఇల్లు చేరేదీ, రైతు దాన్ని తినేదీ?"

"అవునవును, బాగానే ఉంది. మేం ఒక

ఊర్లోకి పోతుండగా, వాడు నాకు ఒక చిన్న కత్తిని ఇచ్చి, దాంతో రెండు గుర్రాల్ని తెమ్మన్నాడు- గుర్రాలతో బాటూ కత్తినీ వెనక్కితేవాలట!"

"రోడ్డు వెంబడి నడిచీ నడిచీ అలసిన వారికి కట్టెలు ఎంత సాయం చేస్తాయంటే, అవి గుర్రాలకు ఏ మాత్రం తీసిపోవు. అతను ఆ కత్తిని నీకిచ్చి, రెండు గట్టి కట్టెలు ఊతానికి, కొట్టుకొని రమ్మన్నాడు. కత్తిని పోగొట్టద్దని చెప్పాడు."

"అలాగా" అన్నాడు రైతు. "మేం నగరంలోంచి వస్తుంటే మాకు తెలిసిన వాళ్ళు ఒక్కరూ కనబడలేదు. చివరికి స్మశానం దగ్గరికి చేరుకునేంతవరకూ, ఆకలితోఉన్న మాకు ఒక్క రొట్టె ముక్క పెట్టినవాళ్ళు లేరు. అక్కడ ఎవరో కొందరు మమ్మల్ని పిలిచి మరీ రొట్టెలు పెట్టారు! అప్పుడు మన వాడు నగరాన్ని స్మశానం అనీ, స్మశానాన్ని నగరం అనీ అన్నాడు."

"చూడండి నాన్నా, అతిథుల్ని ఆదరించటం తెలీని వాళ్లు చనిపోయిన వాళ్లకంటే నీచం. అలాంటి వాళ్లతో నిండిన స్థలాన్ని స్మశానం అనటం తప్పుకాదు. మరి, చనిపోయిన వాళ్లు ఉండాల్సిన స్మశానంలో మిమ్మల్ని ఆదరించి, రొట్టెముక్కలిచ్చే దయగల మనుషులు ఎదురయ్యారు మీకు. అలాంటివాళ్లు ఉండే స్థలం ఏ నగరానికి తీసిపోతుంది, చెప్పు?" అన్నది రైతు కూతురు.

"అవునవును,నిజమే"అన్నాడు రైతు,నిర్ఘాంతపోతూ."కానీ,మరి ఇందాక,మన వాగును దాటేటపుడు. అతను కనీసం బూట్లు కూడా విప్పలేదు!"

"నాకు అతని తెలివి తేటలు చాలా నచ్చినై" అన్నది రైతు కూతురు-"మామూలు జనాలు అందరూ 'అంత వేగంగా ప్రవహించే వాగులోకి చెప్పులు లేకుండా దిగుతారెందుకా', అని నేనే ఎప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. ఏ ముల్లో గుచ్చుకున్నదంటే, తర్వాత అన్నీ కష్టాలే గద!" ఈ మనిషి ఎవరో చాలా తెలివి గలవాడి లాగున్నాడు. నాకు అతన్ని కలిసి మాట్లాడాలని బాగా కోరికగా ఉన్నది." అన్నదాపిల్ల.

"సరే, అయితే. నేను వెళ్ళి అతన్ని పిలుచుకు వస్తాను" అన్నాడు రైతు. "అతనికి చెప్పండి-

మన ఇంటి వాసాలన్నీ గట్టిగానే ఉన్నాయని. అప్పుడు అతను మన ఇంటికి వస్తాడు- ఆగండి ఒకసారి- నేను ముందుగా అతని కోసం కొన్ని కానుకలిచ్చి, ఒక మనిషిని పంపిస్తాను. దాంతో మనం అతిథుల్ని ఆదరించే సమర్థత ఉన్నవాళ్ళమేనని అతనికి అర్థమౌతుంది." అన్నది రైతు కూతురు.

ఆపైన ఆపిల్ల ఇంట్లో పనిచేస్తున్న మనిషినొకడిని పిలిచి, అతనికి ఒక పాయసపు గిన్నె, పన్నెండు రొట్టెలు, ఒక పాల జగ్గు ఇచ్చి పంపిస్తూ, ఇలా చెప్పమన్నది: "మిత్రమా! పున్నమి చంద్రుడు బాగున్నాడు. పన్నెండు నెలలు కలిస్తే ఒక సంవత్సరం అవుతుంది. మరి, సముద్రం నీళ్ళతో పొంగి పొర్లుతున్నది" అని.

పనివాడు మంత్రికొడుకు కోసం ఆ కానుకలు తీసుకుపోతుంటే, దారిలో వాడికి తన కొడుకు- ఆరేళ్ళవాడు- ఎదురయ్యాడు. బుట్టలో ఏమున్నాయో చూసి, పిల్లవాడు వాటికోసం మారాం చేయటం మొదలు పెట్టాడు. తెలివిలేని ఆ పనివాడు పిల్లవాడికి చాలా పాయసమూ, ఒక రొట్టె, కొన్ని పాలు ఇచ్చి, మిగిలిన వాటిని తీసుకెళ్ళి మంత్రికొడుక్కి ఇచ్చాడు, యజమాని కూతురు ఏం చెప్పమన్నదో అది చెబుతూ.

"మీ యజమానురాలికి నా ధన్యవాదాలు, శుభాకాంక్షలూ అందజెయ్యి. ఆమెకి చెప్పు- 'చంద్రుడు పాడ్యమి కళన ఉన్నాడనీ, నాకు సంవత్సరంలో పదకొండు నెలలే కనబడుతున్నాయనీ, సముద్రం ఏమాత్రం నిండలేదనీ' చెప్పు!" అన్నాడు మంత్రికొడుకు , పని వాడితో.

పని వాడికి ఈ సంకేతాల భాష ఏమాత్రంఅర్థంకాలేదు. అయినా వాడు దీనిని జాగ్రత్తగా గుర్తు పెట్టుకొని, ఏ పదానికి ఆ పదం- ఉన్నదున్నట్టు- అప్పజెప్పాడు రైతు కూతురుకు. ఆమె వెంటనే వాడి దొంగపనిని గుర్తుపట్టి నిలదీస్తే, వాస్తవం బయటపడ్డది.

అంతలోనేమంత్రికొడుకు, రైతు కలిసి ఇంటికి వచ్చారు. రైతు కూతురు అతనికి రాజోచితంగా అతిథి సత్కారాలు చేసింది. రైతుకు అతని పుట్టు పూర్వోత్తరాలేవీ తెలీక పోయినా , బిడ్డ అలా చేయటానికి ఏదో ఒక

కారణం ఉండి ఉండాలని ఊరుకున్నాడు.



ఆతర్వాత మాటల క్రమంలో మంత్రి కొడుకు వాళ్లకు తన గురించి అంతాచెప్పాడు- చేప నవ్వటమూ, తన తండ్రి కారణం కోసం వెతకటమూ, కాలాతీతం అవుతున్నదని శిరచ్ఛేద శిక్షకు సిద్ధపడటమూ, ముందుగా తనని రాజ్యం విడచి పొమ్మనటమూ- అన్నీ చెప్పాడు వాళ్లకు. చెప్పి, తనని ఇప్పుడు ఏం చేయమంటారో సలహా అడిగాడు వాళ్ళను.

రైతు కూతురు నవ్వి, "సమస్య మొత్తానికీ మూలం చేప నవ్వులోనే గదా, ఉన్నది? అంత:పురంలో- అందరూ ఆడవాళ్ళే ఉండాల్సిన చోట- ఒక మగవాడు కూడాఎవరో దాక్కొనిఉండాలి. ఆ విషయం చేపకు తెలిసి ఉంటుంది. అంత:పురంలోనే ఉన్న మగవాడిని పట్టుకోలేని రాణీగారు చేపల్లో కూడా ఆడ చేపే కావాలంటున్నారని విని, అది నవ్వి ఉంటుంది. రాజుగారికి ఈసంగతి తెలిసేఅవకాశం లేదు"అన్నది.

"ఓహ్,అద్భుతం ! సరిగ్గా చెప్పావు! నేనువెనక్కి వెళ్తే మా నాన్నగారి ప్రాణాల్ని కాపాడుకోవచ్చు- ఇంకా చాలా సమయం ఉన్నది" అని మంత్రికొడుకు సంతోషంగా అరిచాడు. మరుసటి రోజున తెల్లవారుతుండగానే అతడు రైతు కూతురుతో సహా గుర్రం మీద వెనక్కి బయకు దేరిపోయి, చేప ఎందుకు నవ్విందో చెప్పేసాడు తండ్రికి. చావు భయంతో చిక్కి శల్యమైన మంత్రిగారికి దాంతో ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఆయన వెళ్ళి, రాజు గారిముందు నిలబడి ధైర్యంగా ఈసంగతి చెప్పేసాడు.

"రాణిగారి అంత:పురంలో మగవాడా!? అసంభవం!"అన్నారు రాజుగారు.

"కానీ అది వాస్తవం, మహారాజా! ఈసంగతి

రాణీవారికి కూడా తెలిసి ఉండదు. అంత:పుర స్త్రీలలో దాక్కున్న మగవాడిని పట్టుకోటం కోసం నేనొక పరీక్ష పెడతాను. ఒక పాడవాటి గుంతను త్రవ్వించండి. అంత:పురంలోని స్త్రీలందర్నీ దాని ఇవతలి నుండి అవతలికి దూకమనండి. మగవాడెవరో ఇట్టే తెలిసిపోతుంది" అన్నాడు మంత్రి.

రాజుగారు సరేనని ఒక పొడవాటి గుంత తవ్వించి, అంత:పురంలోని వాళ్ళందర్నీ దానిపైనుంచి దూకమన్నాడు. ఎవ్వరూ దూకలేకపోయారు- ఒక్కరు తప్ప! చూడగా, ఆవ్యక్తి నిజంగానే మగవాడు!

ఆవిధంగా రాణి గారికి తృప్తి కలిగింది. రాజుగారు సంతోషపడ్డారు. ముసలిమంత్రికి ప్రాణాలు నిలవటమేకాక, చక్కని బహుమతి లభించింది.

అనతికాలంలోనే మంత్రి కొడుకు రైతు కూతురిని పెళ్ళి చేసుకున్నాడు. తెలివితేటలు, సూక్ష్మ బుద్ధి గల ఆ జంటసంతోషం ఆపైన రాజ్యమంతటా విస్తరించింది!

జోకు

గుంపే బలం!

నాలుగు చీమలు అడవిలో పోతున్నాయి. వాటి దారికి ఒక ఏనుగు అడ్డం వచ్చింది.

మొదటి చీమ: మనం ఈ ఏనుగును చంపేద్దాంరా!

రెండవ చీమ: వద్దులే. మనం దీని కాలు విరగగొట్టి పంపిద్దాం.

మూడవ చీమ: కాదు కాదు- దీన్ని ఎత్తి, మన దారికి అడ్డం లేకుండా దూరంగా విసిరేస్తే సరి.

నాలుగవ చీమ: లేదు- మనం దీన్ని ఏమీ చేయకుండా వదిలేద్దాం- పాపం అది ఒంటరిది, మనమేమో నలుగురం ఉన్నాం!

(సేకరణ: సుధీర్, బెంగుళూరు.)



పిల్లి దేవుడు

మూలం: పర్తాప్ అగర్వాల్

తెలుగు అనుసరణ: నారాయణ

జనార్దన్ కి బాగా అతి తెలివి. చిన్న తనం నుండీ అతని అల్లరికి హద్దు ఉండేది కాదు. అయితే అతని అల్లరి వల్ల ఎవరికీ పెద్దగా నష్టం జరగలేదు. స్వతహాగా మంచివాడు కావటంతో, అతని స్నేహితులు అతన్ని చాలా ప్రేమించేవాళ్ళు. పెద్దవాళ్ళు ఒక్కోసారి కోప్పడేవాళ్లు. టీచర్లు చాలావరకూ అతన్ని భరించి ఊరుకునేవాళ్ళు.

'జనార్దన్ పెద్దవాడయ్యాక, కాలేజీ చదువులు ముగించుకొని, లక్ష్మిని పెండ్లి చేసుకున్నాడు; చక్కని అపార్టుమెంటు ఒకటి కొనుక్కున్నాడు- కానీ ఆ అల్లరి మెదడు మాత్రం అట్లానే ఉంది. వాళ్లకి ఇంకా పిల్లలు పుట్టలేదు. ఇంట్లో వాళ్ళతో పాటు ఒక పిల్లి

మాత్రం ఉండేది.

ఒకసారి జనార్దన్ కి చాలా జ్వరం వచ్చింది. ఆస్పత్రిలో డాక్టర్లు పెదవి విరిచారు. అదేం జ్వరమో తెలీలేదు ఎవ్వరికీ. ఇక ప్రాణం పోతుందనగా జనార్దన్ కి దేవుడు గుర్తొచ్చాడు- "దేవుడా, దేవుడా! నన్ను ఇంకొంతకాలం బ్రతకనివ్వు. నా రోగం తగ్గించావంటే, నా యీ ఆస్తిని మొత్తాన్నీ అమ్మి, ఆ డబ్బును ఏదైనా మంచి పనికోసం ఇచ్చేస్తాను" అని మొక్కుకున్నాడు.

దేవుడు జనార్దన్ మొర విన్నాడో, లేకపోతే డాక్టర్లిచ్చిన మందులే పనిచేశాయో, అతని ఆరోగ్యం మాత్రం మెల్లగా కుదురుకున్నది. భార్యాభర్తలిద్దరూ సంతోషంగా ఊపిరి పీల్చుకున్నారు.

బాగై ఇంటికి వచ్చిన జనార్దన్ ను తన మొక్కు పీడించసాగింది. "అయ్యో! తప్పు చేశానే! ఈ ఇల్లుని అమ్మేస్తానని మొక్కుకున్నానే! ఇంత పెద్ద ఇల్లుని చేతులారా ఎలా అమ్మేది?! ఆ డబ్బునంతా వేరేవాళ్ళకి ఎలా ఇచ్చేసేది?" అని బాధ మొదలైంది. అలాగని, మొక్కును మరిచిపోయి ప్రశాంతంగా ఉండనూ లేదు! ఇదే ఎడతెరపిలేని ఆలోచన అతన్ని రాతింబవళ్ళూ వెంటాడింది.

అప్పుడు అతని అల్లరి మెదడు మళ్ళీ ఓసారి మేలుకున్నది- అతనికి ఒక గొప్ప ఐడియా ఇచ్చింది! జనార్దన్ వెంటనే దాన్ని అమలు చేశాడు. ఇంటిని ఫలానా తేదీన వేలం వేస్తున్నట్లు బోర్డు పెట్టేశాడు.

అనుకున్న రోజున, ఆయింటిని కొనాలనుకున్నవాళ్లంతా వచ్చారు. జనార్దన్ వేలాన్ని మొదలు పెడుతూ చిన్న ఉపన్యాసమొకటి ఇచ్చాడు- "మిత్రులారా! స్వాగతం! రండి! ఒక ఇంటినీ, ఒక పిల్లినీ వేలానికి పెడుతున్నాను. ఇంటి ఖరీదు ఒక్కరూపాయి మాత్రమే. పిల్లి ఖరీదు మొదటగా లక్ష రూపాయలు మాత్రమే. కొనేవాళ్ళు రెండింటినీ కలిపే కొనాలి. ఇక మొదలు పెట్టండి- ఎవరైనా అంతకంటే ఎక్కువ చెల్లించేవాళ్ళు ఉంటే ముందుకు రండి."

జనాలకు ఆశ్చర్యం వేసింది. ఇంటి ఖరీదు ఎందుకు, అంత తక్కువ? పిల్లి ఖరీదు

ఎందుకు, అంత ఎక్కువ, అని. అయినా వాళ్లలోకొందరు ముందుకు వచ్చి సరదాగా వేలం పాడారు. పిల్లి లక్షా పది వేలకు, ఇల్లు ఒక రూపాయికి అమ్ముడయ్యాయి. ఇంటిని కొన్నవాళ్ళు మరునాడే జనార్దన్ కు డబ్బు ఇచ్చేశారు. జనార్దన్ తన ఇంటిని ఖాళీచేయగానే వాళ్ళు ఆ ఇంట్లోకి చేరుకున్నారు; 'పిల్లి తమకెందుకు' అని దాన్ని తరిమేశారు!

జనార్దన్ ఒక రూపాయిని పట్టుకొని గుడికి వెళ్ళి, దేవుడికి నమస్కారం పెట్టి, "దేవుడా! ఇంటిని అమ్మి, వచ్చిన డబ్బంతా నీకే ఇస్తానన్నాను- ఇదిగో, ఒక రూపాయి వచ్చింది. ఇది నీదే!" అని భక్తిగా ఆ ఒక్క రూపాయినీ హుండీలోవేసి వచ్చాడు. గుళ్ళో దేవుడు సంతోషంగా నవ్వినట్లు అనిపించింది. ఇప్పుడు అతని మనసు తేలికైంది- మొక్కు తీరినందుకు హాయిగా ఉంది.

ఇక ఆపైన జనార్దన్ తన దగ్గర మిగిలిన లక్షా పదివేల రూపాయలు పెట్టి మరొక ఇల్లు కొనుక్కున్నాడు. లక్ష్మి ఇంటిని చక్కగా సర్ది పెట్టింది. ఇద్దరూ సంతోషంగా క్రొత్త ఇంట్లో క్రొత్త జీవితం మొదలు పెట్టారు.

ఆ తర్వాత ఒక రోజు భయంకరమైన భూకంపంఒకటి వచ్చింది. అదృష్టంకొద్దీ ఆ రోజు లక్ష్మి ఇంట్లో లేదు. అనేకమంది ఇళ్లతోపాటు జనార్దన్ క్రొత్త ఇల్లూ కూలింది. జనార్దన్ ఆ గృహ శకలాలలో కూరుకుపోయాడు. బాగా గాయాలయ్యాయి; పైన బరువు పడటం వల్ల, అతను కదలలేకపోయాడు. రెండు రోజులపాటు అతను అలా ఆ శకలాలలో పడి ఉన్నా, కాపాడేందుకు ఎవ్వరూ ఆవైపుకు రాలేదు!

చివరికి అతను నీరసించి పోయి, ప్రాణాలమీద ఆశ వదులుకున్న సమయంలో ఒక విచిత్రం జరిగింది- "మ్యావ్!" అని అరుపు వినబడిందతనికి! పిల్లి!! అది వచ్చి, అరుస్తూ, జనార్దన్ చేతుల్ని నాకటం మొదలు పెట్టింది. చివరికి అదే మిగిలిన వాళ్లకు జనార్దన్ ఆచూకీ చూపించింది! అందరూ కలిసి అతన్ని బయటికిలాగారు.

"దేవుడా! 'నాది' అనుకున్న ఇల్లు వచ్చి నా మీద పడితే, 'నాది కాదు' అని వదిలేసిన పిల్లి వచ్చి నన్ను కాపాడింది. నీ సృష్టిలో హెచ్చు తగ్గులు ఏవీ లేవు. 'నాది-పరాయిది' అంటూ వాటిని కల్పించుకొనేది మా యీ మనసే" అనుకున్నాడు జనార్దన్, పిల్లిని నిమురుతూ, కళ్లనిండా నీళ్ళతో.

జోకులు

టీచరు: పిల్లలూ! ఈరోజు ఉదయం మనకు ఒక్క పూటే బడి ఉంటుంది.

పిల్లలు: (సంతోషంగా) వావ్! ఓహ్! భలే!

టీచరు: (చల్లగా) మధ్యాహ్నం తర్వాత ఇంకో పూట బడి ఉంటుంది.

పిల్లలు: !!!

రెండోవారెవరు?

టీచరు గారు: రామూ! మన మొదటి ప్రధాని ఎవరు?

రాము: తెలియదు టీచర్!

టీచరు గారు: పోనీలే- మరి ఆయన తర్వాత ఎవరు ప్రధాని అయ్యారో చెప్పు, కనీసం.

రాము: రెండవ ఆయన టీచర్!

నింగి సాగే మబ్బుల్లారా!

పాట

రచన, స్వరకల్పన: శ్రీవారణాసి వెంకట్రావు గారు, విజయవాడ.

గానం: అఖిల, 9 వ తరగతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.

నింగి సాగే మబ్బుల్లారా
నీలి పువ్వుల దుబ్బుల్లారా
గాలి తేలి పోతారేమి?
కరిగి కరిగి కురవరేమి? (2)
"నింగి సాగే మబ్బుల్లారా"

చిరు జల్లులు మీరు కురిస్తే
పురి విప్పిన నెమళ్లు మేమై
చిన్నారి పాపలమూ
చిందులేసి ఆడుకుంటాం (2) "నింగి సాగే"

జడివానలు మీరు కురిస్తే
దారులన్ని ఏరులైతే
కాగితాల పడవలు కట్టి
ఊహల్లో ఊళ్లే చూస్తాం (2) "నింగి సాగే"

ఫెళఫెళమని పెనుగాలులు వీచి
గాలివానలే మీరు కురిస్తే
హడలిపోయి గడగడమంటూ
అమ్మ ఒడినె హత్తుకుపోతాం (2)
"నింగి సాగే మబ్బుల్లారా"

చిరు చిరు నవ్వులు

పాట

గానం: గీతిక బృందం, ఏడవ తరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.

చిరు చిరునవ్వుల చిలకల్లారా
బంగరు పలుకుల మొలకల్లారా
మనసులు కలిసి మెలగండీ
మనుగడ కదిలీ మెదలండీ. "చిరు చిరు"

గాంధీ తాత ఏమయ్యాడు?
మహాత్ముడై వెలుగొందాడు - ఎందుకని?
కొట్టిన వారికి కొట్టలేదులే
తిట్టిన వారిని తిట్టలేదులే
సమతా మమతా మనదన్నాడు
స్వాతంత్ర్యం సాధించాడు
గాంధీ తాతా జోహార్!
మహాత్మకూ మా జోహార్! "చిరు చిరు"

చాచా నెహ్రూ ఏమయ్యాడు?
ఏమయ్యాడు?
శాంతిదూతగా నిలిచాడు - ఎందుకని?
శాంతి పథమ్మే కాంతి మార్గమని
ప్రపంచమంతా చాటాడు
చాచా నెహ్రూ జోహార్!
ఎర్ర గులాబీ జోహార్!
శాంతి దూతకూ జోహార్! "చిరు చిరు"

భారతమాత ఏమంటోంది?- ఏమంటోంది?
క్రమశిక్షణతో నడువంటోంది
నడువంటోంది
మీరే జాతికి పునాదులు
నీతికి నిజానికి రారాజులు
మంచిని మీలో పెంచండి
మనమంతా ఒకటని చాటండి
భారతమాతా జిందాబాద్!
చల్లని తల్లికి జిందాబాద్!
అన్నపూర్ణకూ జిందాబాద్! "చిరు చిరు"

ఎంతో మంచిది

పాట

గానం: విజ్ఞంస్కూల్ పిల్లలు, గుడిపాల, చిత్తూరు జిల్లా.

ఎంతో మంచిది మా టీచర్
మాకిస్తుందొక గుడ్ ఫ్యూచర్
లాఫింగ్ క్లాస్, లాఫింగ్ లైవ్స్
"ఎంతో మంచిది"

ఆటకు రమ్మని అంటుంది
ఆటల్లోనే ఆటల్లాగే పాఠాలెన్నో చెబుతుంది
"ఎంతో మంచిది"

పాటలు పాడమంటుంది
డాన్సు చేయమంటుంది
మంచి మంచి కథలను చెప్పి
మమ్మెంతో నవ్విస్తుంది
"ఎంతో మంచిది"

తెలియనివన్నీ చెబుతుంది
బంగారు పాపలు అంటుంది
"ఎంతో మంచిది"

కొత్తపల్లి పత్రికలోని ఈ పాటలు అన్నిటినీ ఇంటర్నెట్లో వినచ్చు!
సందర్శించండి: http://kottapalli.in/08/2010/welcome

వినువీధులలో ఎగిరే జండా

పాట

రచన,స్వరకల్పన: శ్రీవారణాసి వెంకట్రావు గారు, విజయవాడ.

గానం: సరిగమ, కీర్తన, అఖిల, 9 వతరగతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.

వినువీధులలో ఎగిరే జండా-

విశ్వానికి కన్నుల నిండ - వెదజల్లెను కాంతులు పండ!

ఒకే త్రాటిపై నడిచే ప్రజలు-

ఒకే నీతికై నిలిచే ప్రభులు-

ఒకే దృష్టితో మలచిన మతములు-

ఒకే సృష్టిగా చూచెడి జాతులు (...2)

నా దేశపు ఆదేశాలు లోకానికి సందేశాలు(2)

"వినువీధులలో ఎగిరే జండా"

పరదేశపు పీడను బాపగ-

ధైర్యముగా గుండెలు నిలిపి (..2)

శాంతముగా సమరము జరిపి-

స్వాతంత్ర్యం తెచ్చిరి శూరులు(2)

ఆ వీరుల ఆరని జ్యోతి-

నా దేశపు చెదరని ఖ్యాతి!!(2)

"వినువీధులలో ఎగిరే జండా"

చిత్రం: R.స్వర్ణశ్రీ, ఇంటర్మీడియటు, చెన్నేకొత్తపల్లి.

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: లలిత, telugu4kids.com



ఇక్కడున్న బొమ్మను చూడండి-

కొంచెం జాగ్రత్తగా-

తెలుగులో ఏమైనా రాసి ఉందా?

రాక్షసి బల్లులున్నాయా?

నీడలు?

భయం కనబడిందా, మీకు?

మీకు ఇదివరలో ఎప్పుడో భయం వేసిందేమో గదా, దేన్నో చూసి? ఈ బొమ్మను చూస్తూ దాన్ని గురించి ఓ పేజీలో రాసి పంపించండి. అక్టోబరు నెల కొత్తపల్లిలో మీరు రాసినదాన్నే ప్రచురిస్తామేమో, మరి?!

మా చిరునామా:

కొత్తపల్లి బృందం,

2-312, న్యామద్దల రోడ్డు,

చెన్నేకొత్తపల్లి- 515101,

అనంతపురం జిల్లా, ఆం.ప్ర.

కొత్తపల్లి బృందం

సారథ్యం: సుబ్బరాజు

ప్రధాన సంపాదకులు: నారాయణ

సంపాదక వర్గం: మోహనయ్య, జయచంద్ర, మురళి.

సాంకేతిక బృందం: ఆనంద్, లక్ష్మి, లీల.

చిత్రాలు: అడవిరాముడు, శివ, సాయి, స్వర్ణశ్రీ.

రూపకల్పన: సుచరిత, రాజకుమార్

ఆర్థిక వ్యవహారాలు: అలివేలమ్మ

కాపీరైటు: కొత్తపల్లి పత్రికలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యకమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.

చందా వివరాలు

సంవత్సర చందా: 200/ రూ.

చందాను 'కొత్తపల్లి ట్రస్టు' పేరిట మనీఆర్డర్ లేదా డి.డి లేదా చెక్కు రూపంలో కట్టవచ్చును. డి.డి., చెక్కులకు బ్యాంకు చార్జీలు (25రూ) కలపాలని మనవి.

చందాలకై చిరునామా:

కొత్తపల్లి ట్రస్టు,
2-312, న్యామద్దల రోడ్డు, చెన్నేకొత్తపల్లి,
అనంతపురంజిల్లా, 515101.

బ్యాంకు ద్వారా చందా కట్టడానికి వివరాలు:

KOTTAPALLI TRUST,
A/c No:18809 (Savings Type),
CANARA BANK, Chennekottapalli,
Anantapur District, A.P.
IFSC code: CNRB0000138.

డబ్బు కట్టిన వివరాలను ఇమెయిలు/ ఫోను/ ఉత్తరం ద్వారా కొత్తపల్లికి తెలియపరచగలరు.

ఇమెయిలు: team@kottapalli.in
ఫోను: 08559 240222.

కృతజ్ఞతలు:

పత్రికకోసం నిరంతరంగా పిల్లల రచనల్ని అందించి సహకరిస్తున్న ప్రకృతిబడి, టింబక్టు బడి, విజ్ఞం స్కూల్ యాజమాన్యాలకు కృతజ్ఞతలు. వెబ్ సైటుకు వెన్నుదన్నుగా నిల్చిన infogami యాజమాన్యానికి, దాన్ని సుసాధ్యం చేసిన python భాషకు, చక్కని ఆపరేటింగ్ సిస్టం linux ను అందించిన ubuntu వారికి, గొప్ప వ్యవస్థని పూర్తిగా ఉచితంగా అందిస్తున్న OpenOffice వారికి, తెలుగును రప్పిస్తున్న Unicode, Scim, Baraha లకు, చిత్రాలను సరిదిద్దే Software Gimp నిర్మాతలకు, శబ్దాలను చక్కబరచే Software Audacity నిర్మాతలకు కృతజ్ఞతలు.

మంచి పుస్తకం:

అల్లిబిల్లి కథలు

బాగా ఎండగా ఉందట.
ఎండలో ఒక తారు రోడ్డు ఉందట.
దాని ప్రక్కనే ఉందొక చెరువు.
చెరువు నిండా నీళ్ళు.
ఎండ వేడికి ఆ నీళ్ళు పొగలు క్రక్కుతున్నాయట.
అప్పుడా రోడ్డు మీది నుంచి ఒక లారీ వెళ్తోందట.
దాని నిండా టీ పొడి ఉంది.
పోయీ పోయీ అది దొర్లి, చెరువులో
పడిపోయింది.



చెరువంతా డికాషన్ అయిపోయిందిట.
మళ్ళీ ఒక పాల వ్యాను వచ్చిందిట.
'అయ్యో, టీ పొడి లారీ!' అనుకుంటూ, తనూ దొర్లి, చెరువులో పడిపోయిందిట.
చెరువులో డికాషన్‌కు మంచి రంగు వచ్చిందిట.
ఆ తర్వాత వచ్చిందొక చక్కెర లారీ... ఏమైందో మీకు అర్థం అయింది గదా?
అలా చక్కని టీ చెరువు తయారైందట.
ముగ్గురు లారీ డ్రైవర్లూ ఆ చెరువు గట్టున కూర్చొని వేడి వేడి టీ త్రాగుతున్నారట.
మనమూ పోదామా?

ఈ కథా, ఇంకా పూలతోటని ఇంట్లోకి తెచ్చుకునే కథ, తుంటరి కప్ప కథ, కాకిపిల్ల కథ- ఇలాంటి అద్భుతమైన కథలు, వాటికి ప్రాణం పోసిన చక్కని బొమ్మలు మీకోసం ఎదురు చూస్తున్నై- బమ్మిడి జగదీశ్వర రావు గారు రాసిన "అల్లిబిల్లి కథలు" పుస్తకంలో. ఇంకా బడికెళ్ళని బుజ్జిపిల్లలకు, వాళ్ళను ఇష్టపడే పెద్దవాళ్ళు చూపిస్తూ చెప్పాల్సిన కథలు ఇవి! ఆలస్యం ఎందుకు, పదండి! వెతుక్కుందాం ఈ పుస్తకాన్ని- ఎక్కడుందో, ఏమో!